




PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 234, పేజీలు - 08

ఆదివారం, ఫిబ్రవరి 8, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD







# బస్తీ మే సవాల్

## - మున్సిపోరులో గల్లీ సమస్యలు మాయం.. ఢిల్లీ స్థాయి రాజకీయం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ప్రచారం చివరి దశకు చేరుకుంటోంది. అయితే ఓటర్ల కనీస అవసరాలైన డ్రైనేజీ, రోడ్లు, తాగునీరు వంటి స్థానిక అంశాల కంటే రాష్ట్రస్థాయి రాజకీయ విమర్శలే ఎక్కువగా వినిపిస్తున్నాయి. మున్సిపల్ ఎన్నికలంటేనే స్థానిక సమస్యల పరిష్కారం కోసం జరిగే పోరు. కానీ, ప్రస్తుతం ప్రధాన పార్టీల మధ్య జరుగుతున్న మాటల యుద్ధం చూస్తుంటే, ఇది కేవలం అధికార, ప్రతిపక్షాల మధ్య పైచేయి సాధించే రాజకీయ కుస్తీగా మారిందన్న అభిప్రాయం వినిపిస్తోంది. ముఖ్యంగా అజెండా సెట్ చేయడంలో అధికార కాంగ్రెస్ తనదైన శైలిలో ముందుకెళ్తుంటే, ప్రతిపక్షాలు ఆ ట్రాప్‌లో చిక్కుకున్నట్లు కనిపిస్తోంది.

**- బహిరంగసభల్లో రాజకీయమే మాట్లాడుతున్న రేవంత్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ప్రసంగాల్లో స్థానిక మున్సిపల్ సమస్యల కంటే ఎక్కువగా రాజకీయ అంశాలనే హైలెట్ చేస్తున్నారు. బీజేపీ-బీఆర్ఎస్ మధ్య ఉన్న రహస్య బంధం, కాళేశ్వరం అవినీతి, ఫోన్ ట్యాపింగ్ వంటి అంశాలను ప్రస్తావిస్తూ ప్రత్యర్థులను డిఫెన్స్‌లో పడేస్తున్నారు. ప్రతిపక్ష నేతలను వ్యక్తిగతంగా టార్గెట్ చేయడం ద్వారా ఎన్నికల వాతావరణాన్ని పూర్తిగా రాజకీయ కోణంలోకి మళ్లించడంలో రేవంత్ రెడ్డి సఫలమయ్యారు. నిజామాబాద్ సభలో ఆయన చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం. దీనివల్ల ఓటరు దృష్టి స్థానిక కౌన్సిలర్ పనితీరు కంటే రాష్ట్రస్థాయి రాజకీయాల వైపు మళ్లుతోంది.

**- ఇప్పటికే ట్రాప్‌లో పడిపోయిన విపక్షాలు**

ప్రతిపక్ష బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన పార్టీ శ్రేణులకు పదే పదే హెచ్చరికలు జారీ చేస్తున్నారు. కాంగ్రెస్ సెట్ చేసే రాజకీయ ట్రాప్‌లో పడొద్దని, ప్రజల వద్దకు వెళ్లేటప్పుడు స్థానిక సమస్యలను, కాంగ్రెస్ వైఫల్యాలను ఎత్తిచూపాలని కోరారు. కానీ, వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ముఖ్యమంత్రి చేసే రాజకీయ విమర్శలకు కౌంటర్ ఇవ్వడానికే బీఆర్ఎస్ నేతలు ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతో స్థానిక అంశాలను హైలెట్ చేయడంలో విపక్షాలు విఫలమవుతున్నాయని, తద్వారా రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా విసిరిన వలలో వారు చిక్కుకున్నారనే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రధాన ప్రతిపక్షాలు అయిన బీఆర్ఎస్, బీజేపీ స్థానిక సమస్యలు, మున్సిపాలిటీల్లో నిలిచిపోయిన అభివృద్ధి



పనులను చర్చలోకి తీసుకురావడంలో ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేకపోతున్నాయి. కేవలం ముఖ్యమంత్రిని విమర్శించడానికే ప్రాధాన్యత ఇస్తుండటంతో, ఓటర్లు కూడా స్థానిక అభ్యర్థి వ్యక్తిత్వాన్ని, పనితీరును గమనించడం మానేశారు. ప్రభుత్వ వ్యతిరేకతను ఓట్ల రూపంలోకి మార్చుకోవాలంటే ఉండాల్సిన గ్రౌండ్ లెవల్ అజెండా ప్రతిపక్షాల వద్ద కరువైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

2లో..

# ఇకపై ఆ వస్తువులపై జీరో టారిఫ్

## - పీయూష్ గోయల్ కీలక ప్రకటన



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారత ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపిరి పోస్తూ అమెరికాతో కుదిరిన చారిత్రాత్మక వాణిజ్య ఒప్పందం గురించి కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ శనివారం(ఫిబ్రవరి 7) కీలక వివరాలను వెల్లడించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ఒప్పందంపై సంతకం చేయడంతో భారతీయ ఉత్పత్తులకు ప్రపంచంలోనే అతిపెద్ద మార్కెట్ అయిన అమెరికాలో అద్భుతమైన అవకాశాలు లభించనున్నాయి. ముఖ్యంగా భారతీయ ఎగుమతిదారులకు, రైతులకు, చిన్నతరహా పరిశ్రమలకు ఈ ఒప్పందం ఓ గొప్పవరంగా మారనుంది.

**- జీరో సుంకం వర్తించే ఉత్పత్తులు**

ఈ ఒప్పందంలోని అత్యంత కీలకమైన అంశం ఏమిటంటే భారత్ నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే పలు వస్తువులపై దిగుమతి సుంకాలు పూర్తిగా తొలగించడం వల్ల మన దేశ వస్తువులకు అమెరికాలో

2లో..

# క్వాంటమ్ విప్లవానికి మనదే నాయకత్వం..

# ఇది చారిత్రక ఘట్టం



**- అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ భవనానికి శంకుస్థాపన**

**- ఇది కేవలం ఏపీకి కాదని, భారతదేశ చరిత్రలో ఒక చారిత్రక రోజని సీఎం వ్యాఖ్య**

**- క్వాంటమ్ విప్లవానికి భారత్ నాయకత్వం వహిస్తుందన్న ధీమా**

అమరావతి (ప్రశ్న న్యూస్) "ఇది కేవలం అమరావతికో, ఆంధ్రప్రదేశ్‌కో సంబంధించిన రోజు కాదు. యావత్ భారతదేశ చరిత్రలో ఇదొక చారిత్రక దినం. గతంలో మనం వ్యవసాయ, పారిశ్రామిక విప్లవాలను అందిపుచ్చుకోలేకపోయాం. కానీ, కమ్యూనికేషన్, ఐటీ విప్లవంలో వేగంగా అడుగులు వేశాం. ఇప్పుడు ప్రపంచం ముందున్న క్వాంటమ్ విప్లవంలో మనం అనుసరించడం కాదు, ఏకంగా నాయకత్వం వహించబోతున్నాం. ఆ మహాయజ్ఞానికి అమరావతి నుంచే పునాది వేస్తున్నాం" అని



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. అమరావతి భవిష్యత్తును, తద్వారా దేశ సాంకేతిక ప్రగతిని నిర్దేశించే 'క్వాంటమ్ వ్యాలీ' భవన నిర్మాణానికి శనివారం కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు తన దార్శనికతను, భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించారు. ఆనాటి రోజులను గుర్తు చేసుకున్న చంద్రబాబు, "1995లో

2లో..

# పవన్ కల్యాణ్ దృష్టిలో పడితే జెట్ స్పీడే

## - సోషల్ మీడియాలో పిల్లల పోస్టు చూసి రోడ్ మంజూరు



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తన ఉదారతను చాటుకున్నారు. సామాజిక మాధ్యమాల్లో విద్యార్థులు వ్యక్తం చేసిన ఆవేదనకు స్పందించి, తక్షణమే రోడ్డు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయించారు. ప్రభుత్వ యంత్రాంగం ప్రజా సమస్యలపై ఎంత వేగంగా స్పందిస్తుందో ఈ ఘటన మరోసారి నిరూపించింది.

**- విద్యార్థుల పిలుపు.. పవన్ కళ్యాణ్ స్పందన**

"పవన్ సర్.. మా ఊరికి రోడ్డు వేయండి" అంటూ నెల్లూరు జిల్లా గజ్జలవారిపల్లి విద్యార్థులు సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వీడియో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి వెళ్లింది.

2లో..

# కేసీఆర్‌వి శుక్రచార్యుడి పన్నాగాలు

## - వికారాబాద్‌లో రేవంత్ రెడ్డి ధ్వజం

**- బీఆర్ఎస్, బీజేపీల మధ్య చీకటి ఒప్పందం**

**- గోదావరి జలాలు, ప్రాజెక్టులపై ఆరోపణలు**

**- కేసీఆర్ దొంగ పాస్‌పోర్ట్ చరిత్ర చెరిగేదా?**

**- చట్టం అందరికీ ఒక్కటేనన్న సీఎం రేవంత్**





వికారాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో రాజకీయాలు మరింత హీట్ ఎక్కాయి. బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ ల మధ్య మాటల మంటలు మాత్రం ఆగడంలేదు. మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న కోలది నేతలు ఆరోపణల డోస్ ను మరింత పెంచారు. సీఎం రేవంత్ రెడ్డి వికారాబాద్ లోని పరిగిలో పర్యటించారు. ఈ నేపథ్యంలో "ప్రజా పాలన- ప్రగతి బాట" బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని గత పాలనపై కేసీఆర్, బీజేపీపై నిప్పులు చెరిగారు. గత ప్రభుత్వం చేసిన అప్పులను, తప్పులను సరిదిద్దుకుంటూ తెలంగాణను ముందుకు తీసుకొని వెళ్తున్నామన్నారు. రాష్ట్రంలో పదేళ్లు కేసీఆర్, కేంద్రంలో పన్నెండేళ్లు మోదీ అధికారంలో ఉన్నా రాష్ట్రానికి చేసిందేం లేదని ఎద్దేవా చేశారు. మోదీని చూసి ఓట్లు వేయాలని బీజేపీ నాయకులు అంటున్నారని, ఎవరైనా పెళ్లి పెద్దను చూసి పిల్లనిస్తారా.? అంటూ సెటైర్లు వేశారు. ప్రధాని మోదీని చూసి ఓటేస్తే గల్లీలో ఉండే బోడిగాడు పనిచేయకపోతే ఢిల్లీకి వెళ్లి అడగారా అంటూ మండిపడ్డారు. బీజేపీ కార్యకర్తలు వాళ్ల బీ ఫామ్ బీఆర్ఎస్ ఆఫీసులో తెచ్చుకుంటుని ఎద్దేవా చేశారు. బీజేపీ, బీఆరెస్ వి చీకటి ఒప్పందాలంటూ మండిపడ్డారు. నిజంగా మీరు సమస్యలు పరిష్కరించి ఉంటే ప్రజలు మీకే ఓటేసే వారని అన్నారు. ఆనాడు నిజంగా కేసీఆర్, మోడీ నిధులు ఇచ్చి ఉంటే వాళ్లకు ఇవాళ ఇల్లు ఇల్లు తిరిగి ఓట్లు అడగాల్సిన పరిస్థితి ఎందుకు? వస్తుందన్నారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును ఉమ్మడి రాష్ట్రంలో మంజూరు చేస్తే రంగారెడ్డి జిల్లాకు గోదావరి జలాలు ఇచ్చేది లేదని కేసీఆర్ పడావు పెట్టారన్నారు. చేవెళ్ల దగ్గర ఉన్న ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టు శిలాఫలకం ఇందుకు సజీవ సాక్ష్యమన్నారు. రంగారెడ్డి జిల్లాకు 3 టీఎంసీలు గోదావరి జలాలు అందిస్తే వేల ఎకరాలకు

2లో..

### కేసీఆర్‌పై చర్యలు తీసుకుంటామంటే

# అడ్డుకున్నదెవరు.?

## - సీఎం రేవంత్ కు చేతకాక తమపై నిందలు వేస్తున్నారని ఆగ్రహం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, హరీశ్ రావులను ఎప్పుడు అరెస్టు చేస్తారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల ప్రశ్నించడం తెలిసిందే. వారిని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కాపాడుతున్నారని ఆయన ఆరోపించారు. ఈ ఆరోపణలపై కిషన్ రెడ్డి స్పందించారు. ముఖ్యమంత్రికి చేతకాక వారిపై చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కానీ బాధ్యతారాహిత్యంతో తమపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్‌తో కలిసి ఉన్నామని చెప్పుకోవాలని వ్యాఖ్యానించారు. కిషన్ రెడ్డి వల్లనో, కేంద్ర ప్రభుత్వం వల్లనో చర్యలు తీసుకోవడం లేదని మాపై నిందలు వేయవద్దని అన్నారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, కేసీఆర్‌పై చర్యలు తీసుకుంటానంటే రేవంత్ రెడ్డిని ఎవరు అడ్డుకున్నారో చెప్పాలని నిలదీశారు. రాష్ట్రంలో చర్యలు తీసుకోవాల్సింది ముఖ్యమంత్రి, ఇక్కడి ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. తన పేరు లేదా కేంద్రం పేరు చెప్పి రేవంత్ రెడ్డి ఎక్కువ రోజులు తప్పించుకోలేరని అన్నారు. కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాలని ఏ ఒక్కరోజైనా రాహుల్ గాంధీ రేవంత్ రెడ్డిని ప్రశ్నించారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీని అడ్డుకోవడం కోసం సోనియా గాంధీ కుటుంబం, కేసీఆర్ కుటుంబం ఒక్కటయ్యాయని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

### ఫోరెన్సిక్ ల్యాబ్ లో

# అగ్ని ప్రమాదం

**- ప్రమాదంలో కీలక కేసుల సాక్ష్యాలన్నీ బుగ్గి**

**- అగ్ని ప్రమాదం వెనుక కుట్ర ఉందా.?**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లోని స్టేట్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్)లో శనివారం ఉదయం సంభవించిన భారీ అగ్నిప్రమాదం రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టిస్తోంది. ఈ ప్రమాదంలో కీలకమైన కేసులకు సంబంధించిన ఆధారాలు, డిజిటల్ సాక్ష్యాలు అగ్నికి

2లో..

# తెలంగాణలో "పంచనగరి"

**-హైదరాబాద్‌కు దీటుగా మెగా సిటీ కారిడార్**

**-వరంగల్-కరీంనగర్ కారిడార్‌పై రేవంత్ రెడ్డి విజన్**

**-ఐదు నగరాల అనుసంధానంతో మెగా సిటీ ప్లాన్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో అభివృద్ధి అంతా హైదరాబాద్ చుట్టూనే కేంద్రీకృతమై ఉంది. ఇది కాదనలేని సత్యం. తెలంగాణ వ్యాప్తంగా డెవలప్‌మెంట్ జరగాలంటే నగరాలను విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

2లో..

### రేవంత్ ఏనాటికైనా

# బీజేపీ మనిషే

## - కేటీఆర్ సంచలన కామెంట్స్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఏనాటికైనా బీజేపీ మనిషేనని ఆయన కప్పుకున్న ముసుగు తొలగించి చూడాలని అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేటీఆర్ శనివారం బాన్సువాడలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ సీఎం రేవంత్ ఏనాటికీ కాంగ్రెస్ మనిషి కాలేదని, ఆయన ముందు నుంచి బీజేపీ మనిషి అని ఆరోపించారు. రేవంత్ ముమ్మాటికి బడే భాయ్ తమ్ముడు

2లో..

# త్వరలోనే మలేషియాలో తొలి భారత కాన్సులేట్

## - మలేషియాలో పర్యటిస్తున్న ప్రధాని మోదీ

**-ఆరో తరం మలేషియా భారతీయులకూ ఓసీఐ కార్డుల అర్హత**

**-యూనివర్సిటీ మలయాలో తిరువళ్లువర్ సెంటర్ ఏర్పాటు**

**-కౌలాలంపూర్‌లోని భారతీయ కమ్యూనిటీ కార్యక్రమంలో మోదీ**




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారత్, మలేషియా మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా ప్రధాని నరేంద్ర మోదీ కీలక ప్రకటన చేశారు. మలేషియాలో త్వరలోనే తొలి భారత కాన్సులేట్‌ను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. శనివారం కౌలాలంపూర్‌లో జరిగిన

2లో..

# బస్తీ మే సవాల్

## -ప్రజల ఓటింగ్ ప్రయారిటీ ఏమిటి.?

మున్సిపల్ ఎన్నికల ద్వారా తమ గల్లీలోని సమస్యలు తీరతాయని ఆశించిన ప్రజలకు, నేతల మధ్య సాగుతున్న రాజకీయమే కనిపిస్తోంది. ప్రతిపక్షాలు తమ పంథా మార్చుకోకుండా ఇదే రాజకీయ ట్రాప్‌లో కొనసాగితే, అది అధికార పార్టీకి మరింత అడ్వాంటేజ్‌గా మారే అవకాశం ఉంది. ఫలితంగా మున్సిపల్ ఎన్నికల ఫలితాలు స్థానిక అవసరాల కంటే, రాజకీయ బలబలాలను నిరూపించుకునే రిఫరెండంలా మారబోతున్నాయి. ఈ ఎన్నికల ప్రచారం ముగిసేలోపు విపక్షాలు కేటీఆర్ చెప్పినట్లుగా స్థానిక అజెండాను ఎంతవరకు ప్రజల్లోకి తీసుకెళ్లగలవు అనే దానిపైనే ఫలితాలు ఆధారపడి ఉంటాయి. రేవంత్ రెడ్డి రాజకీయ వ్యూహాలను అధిగమించి, ప్రజల కష్టాలను చర్చలోకి తీసుకువస్తేనే విపక్షాలకు మైలేజీ లభిస్తుంది. లేదంటే ఈ ఎన్నికలు కేవలం రాజకీయ రంగు పులుముకున్న వార్ లాగే మిగిలిపోతాయని అనుకోవచ్చు.

# ఇకపై ఆ వస్తువులపై జీరో టారిఫ్

ధర తగ్గి.. గిరాకీ పెరుగుతుంది. టీ, కాఫీ, మసాలా దినుసులు, కొబ్బరి నూనె, కొబ్బరి ఉత్పత్తులు, వెజిటబుల్ వాక్స్ వంటి ఉత్పత్తులపై ఇకపై ఎటువంటి పన్ను ఉండదు. మామిడి, అరటి, జామ, అవకాడో, అనానస్, పపాయా వంటి పండ్లు, తృణధాన్యాలు, బేకింగ్ ఉత్పత్తులకు అమెరికా మార్కెట్‌లో 'జీరో టారిఫ్' ప్రవేశం లభించింది. దాదాపు 13 బిలియన్ డాలర్ల విలువైన భారతీయ మందుల ఎగుమతులపై సున్నా సుంకం వర్తిస్తుంది. ఇది మన ఫార్మా కంపెనీలకు భారీ లాభాలను తెచ్చిపెడుతుంది. వజ్రాలు, రత్నాలు, ఆభరణాలు, ప్లాటినం, గడియారాల ఎగుమతిపై సుంకాలు ఎత్తివేయడం వల్ల ఈ రంగంలోని కార్మికులకు చేతినిండా పని లభిస్తుంది. భారత్ నుంచి ఎగుమతి అయ్యే స్మార్ట్‌ఫోన్లపై కూడా భవిష్యత్తులో సున్నా సుంకం వర్తించేలా ఒప్పందం కుదిరింది.

### - రైతుల ప్రయోజనాలే పరమావధి

ఈ ఒప్పందాన్ని కుదుర్చుకోవడంలో భారత ప్రభుత్వం రైతుల ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చింది. మన దేశ రైతులు పండించే ఉత్పత్తులకు అమెరికా మార్కెట్‌లో సులభంగా ప్రవేశం కల్పిస్తూనే, విదేశీ ఉత్పత్తుల పోటీ నుంచి మన రైతులను కాపాడేలా జాగ్రత్తలు తీసుకున్నారు. పాల ఉత్పత్తులు, గోధుమలు, బియ్యం, మొక్కజొన్న, చక్కెర వంటి రంగాలను ఈ ఒప్పందం నుంచి మినహాయించారు. అంటే అమెరికా నుంచి ఈ వస్తువులు తక్కువ ధరకు భారత్‌కు వచ్చి మన రైతులకు నష్టం కలిగించకుండా ప్రభుత్వం రక్షణ కల్పించింది. ఎగుమతులు పెరగడం వల్ల భారతీయ రైతులకు గిట్టుబాటు ధర లభించి, వారి ఆదాయం పెరిగే అవకాశం ఉంది.

### - అమెరికాకు లభించే ప్రయోజనాలు

వాణిజ్యం అనేది ఇరుపక్షాలకు లాభదాయకంగా ఉండాలి కాబట్టి భారత్ కూడా అమెరికాకు కొన్ని మినహాయింపులు ఇచ్చింది. అమెరికా నుంచి భారత్‌కు వచ్చే వైన్, మద్యం, కాస్మెటిక్స్, వైద్య పరికరాలు, పారిశ్రామిక యంత్రాలపై దిగుమతి సుంకాలను తగ్గించనున్నారు. అయితే, ఇక్కడ కూడా మన దేశీయ పరిశ్రమలు దెబ్బతినకుండా 'కనీస దిగుమతి ధర'నిబంధనలను ప్రభుత్వం అమలు చేయనుంది.

### - ఆత్మనిర్భర్ భారత్ దిశగా మరో అడుగు

ఈ ఒప్పందం భారత్‌ను ఆత్మనిర్భర్ దిశగా తీసుకెళ్తుందని పీయూష్ గోయల్ ధీమా వ్యక్తం చేశారు. కేవలం ఎగుమతులు పెరగడమే కాకుండా, లక్షలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ డీల్ వల్ల అమెరికాలో చైనా వస్తువుల కంటే భారత వస్తువులకే ప్రాధాన్యత పెరిగే అవకాశం ఉండటం గమనార్హం.

## క్వాంటమ్ విప్లవానికి మనదే నాయకత్వం..

# ఇది చారిత్రక ఘట్టం

నేను ముఖ్యమంత్రి అయినప్పుడు బిల్ గేట్స్ ఇంటర్నెట్‌ను ఆవిష్కరించారు. అప్పుడు దాని ప్రాముఖ్యతను గుర్తించి రాష్ట్రాన్ని ఆ దిశగా నడిపించా. మాజీ ప్రధాని వాజ్‌పేయి గారు టెలికమ్యూనికేషన్ రంగంలో సంస్కరణలు తీసుకురావడం, నేను హైటెక్ సిటీని ప్రారంభించడం దేశ ఐటీ రంగంలో గేమ్ ఛేంజర్‌గా నిలిచాయి. ఆనాడు వాజ్‌పేయి గారు హైటెక్ సిటీని ప్రారంభిస్తే, నేడు క్వాంటమ్ వ్యాలీకి ఇక్కడ పునాది పడింది. ఇది దేశానికే మరో గేమ్ ఛేంజర్ అవుతుంది. ఈ చరిత్రలో మనమందరం భాగస్వాములం" అని ఉద్వేగంగా ప్రసంగించారు. తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలో ప్రభుత్వం కేటాయించిన 50 ఎకరాల విస్తీర్ణంలో ఈ క్వాంటమ్ వ్యాలీ రూపుదిద్దుకోనుంది. ఇది కేవలం ఒక భవనం కాదు, క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, రక్షణ, ఆరోగ్యం, ఆర్థిక రంగాల్లో పరిశోధనలు, ఆవిష్కరణలకు కేంద్రంగా మారనుంది. వచ్చే 40 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు సీఎం స్పష్టం చేశారుఈ సందర్భంగా ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి దిగ్గజ సంస్థల ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడుతూ, "భారతదేశంలోనే తొలి 133 క్యూబిట్ క్వాంటమ్ కంప్యూటర్‌ను అమరావతికి తీసుకురావాలి. ఒకటి రెండు నెలల్లో ఒప్పందాలు పూర్తిచేసి, ఈ ఏడాది చివరికల్లా తొలి క్వాంటమ్ కంప్యూటర్‌ను ఇక్కడ ఏర్పాటు చేయాలి.

ఏప్రిల్ 14 నాటికి మరో రెండు క్వాంటమ్ సెంటర్లను కూడా ప్రారంభిస్తాం" అని లక్ష్యాలను నిర్దేశించారు. 2030 నాటికి రాష్ట్రంలో 2.5 లక్షల మంది క్వాంటమ్ నిపుణులను తయారు చేయాలనే బృహత్ ప్రణాళికను ఆయన వివరించారు. అమరావతిని ప్రపంచ పటంలో నిలపాలన్న తన సంకల్పానికి బలం చేకూరుస్తూ, మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ ఈ నెల 16న అమరావతికి రానున్నట్లు చంద్రబాబు ప్రకటించడం సభలో హర్షాతిరేకాలు రేపింది. దేశంలోని ఐటీ నిపుణుల్లో 35 శాతం మంది తెలుగువారేనని గుర్తు చేస్తూ, వారి ప్రతిభను రాష్ట్ర భవిష్యత్తు కోసం వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, మంత్రులు నారాయణ, కందుల దుర్గేశ్, ఐఐటీ, టీసీఎస్, ఐబీఎం, ఎల్ అండ్ టీ సంస్థల ఉన్నతాధికారులు, విద్యావేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ శంకుస్థాపన, ఆంధ్రప్రదేశ్‌ను భవిష్యత్ సాంకేతిక హబ్‌గా మార్చే ప్రయాణంలో ఒక మైలురాయిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు.

# పవన్ కల్యాణ్ దృష్టిలో పడితే జెట్ స్పీడే

బురద రోడ్డులో ప్రతిరోజూ పాఠశాలకు వెళ్లేందుకు చిన్నారి విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను చూసి ఆయన చలించిపోయారు. తక్షణమే స్పందించిన పవన్ కళ్యాణ్, సంబంధిత అధికారులతో మాట్లాడి గజ్జలవారిపల్లి గ్రామ సమస్యపై పూర్తి వివరాలు సేకరించారు. ఆ విద్యార్థుల కష్టాలను తీర్చడమే లక్ష్యంగా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### - యుద్ధ ప్రాతిపదికన రోడ్డు మంజూరు

ఉప ముఖ్యమంత్రి ఆదేశాలతో నెల్లూరు జిల్లా కలెక్టర్, పంచాయతీరాజ్ అధికారులు రంగంలోకి దిగారు. గజ్జలవారిపల్లి నుంచి స్కూలుకు వెళ్లే 1.6 కిలోమీటర్ల మేర ఉన్న బురద రోడ్డును బాగు చేసేందుకు రూ. 86 లక్షలతో అంచనాలను రూపొందించారు. కేవలం కొన్ని గంటల వ్యవధిలోనే ఈ నిధులకు సంబంధించిన పరిపాలన అనుమతులు మంజూరయ్యాయి. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే విద్యార్థులతో పాటు, పొలాలకు వెళ్లే రైతులకు కూడా ఏళ్లనాటి రవాణా కష్టాలు తీరనున్నాయి.

### - ఉదయగిరి నియోజకవర్గంలో అభివృద్ధి వెల్లువ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉదయగిరి నియోజకవర్గం రోడ్ల నిర్మాణంలో సరికొత్త రికార్డు సృష్టిస్తోంది. ఇప్పటికే 'పల్లె పండుగ' 1.0, 2.0 కార్యక్రమాల కింద సుమారు రూ. 55 కోట్ల నిధులతో 641 రోడ్ల నిర్మాణ పనులు చేపట్టారు. ఇందులో భాగంగా 437 రోడ్ల పనులు తుది దశకు చేరుకోగా, మరో 200 పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వీటికి అదనంగా సాస్కీ నిధుల నుంచి రూ. 9 కోట్లతో దుత్తలూరు, కొండాపురం, సీతారాంపురం , వింజమూరు మండలాల్లోని ప్రధాన రహదారులను అభివృద్ధి చేస్తున్నారు.

### - ప్రజా ప్రభుత్వం - తక్షణ పరిష్కారం

సాధారణంగా ప్రభుత్వ పనులు మంజూరు కావడానికి నెలల సమయం పడుతుంది, కానీ గజ్జలవారిపల్లి ఘటనలో పవన్ కళ్యాణ్ చూపిన చొరవతో అది ఒక్కరోజులోనే సాధ్యమైంది. సమస్య ఏదైనా, అది ప్రజల నుంచి వస్తే తక్షణమే పరిష్కారం లభిస్తుందని ఈ ఘటనతో స్పష్టమైంది. తమ అభ్యర్థనపై స్పందించి రోడ్డు మంజూరు చేసినందుకు గజ్జలవారిపల్లి గ్రామస్తులు , విద్యార్థులు ఉప ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

# కేసీఆర్‌వి శుక్రచార్యుడి పన్నాగాలు

సాగు నీరు అందేదన్నారు.రంగారెడ్డి జిల్లా అభివృద్ధి కోసమే పార్టీ మారామని ఆనాడు సబితా ఇంద్రారెడ్డి చెప్పారని, మరి చేవెళ్ల ప్రాజెక్టు పూర్తికి అనుమతులు ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నలు వేశారు. మీరు చేసిన ద్రోహానికి ప్రజలను కలిసే అర్హత మీకు ఉందా? అంటూ రేవంత్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రోజమ్మ రొయ్యలపులుసు తిని రాయలసీమను రత్నాల సీమ చేస్తానన్నాడు కేసీఆర్ కానీ రంగారెడ్డికి గోదావరి జలాలు ఇస్తానని చెప్పలేదని బీఆర్ఎస్ పై మండిపడ్డారు. లక్ష్మీదేవిపల్లిలో రిజర్వాయర్ కు సంబంధించి భూసేకరణ త్వరలోనే పూర్తిచేస్తాం ప్రాజెక్టు పూర్తికి ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. కేసీఆర్ నిర్లక్ష్యానికి రంగారెడ్డి జిల్లా బలైందని, లక్ష కోట్లు పెట్టి కట్టిన కాళేశ్వరం మూడేళ్లలో కూలేశ్వరం అయిందన్నారు. కాళేశ్వరంతో వాళ్ల కుటుంబ సభ్యులు ఫామ్ హౌసులు కట్టుకున్నారని, వ్యాపారాలు పెట్టుకున్నారు తప్ప రంగారెడ్డి ప్రజలకు, తెలంగాణ ప్రజలకు చేసిందేం లేదన్నారు. గోదావరి జలాలు తెచ్చి తాండూరు, పరిగి,వికారాబాద్ సస్యశ్యామలం చేసే బాధ్యత మాదని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తాండూరుకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, కాగ్నా నుంచి తాగునీరు అందిస్తామన్నారు.
మక్తల్, నారాయణపేట, కొడంగల్ నియోజక వర్గాలకు కృష్ణా జలాలు తరలించి 1 లక్ష 50 వేల ఎకరాలకు నీరు అందిస్తామని హామీఇచ్చారు. పదేళ్లు అధికారంలో ఉన్నవాళ్లు అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ రోడ్డు పూర్తి చేయలేదని మండిపడ్డారు. రోడ్డు ప్రమాదాల్లో ఎంతో మంది చనిపోయారు.. ఈ పాపం కేసీఆర్, సబితా ఇంద్రారెడ్డిది కాదా అంటూ మండిపడ్డారు. వికారాబాద్ ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా మారబోతోందన్నారు. రెండేళ్లలో పేదలకు రేషన్ కార్డులు అందించాం, సన్నబియ్యం అందించామన్నారు. కేసీఆర్, కల్వకుంట్ల కిషన్ రావ్ రాసిపెట్టుకోవాలన్నారు.
రాబోయే ఎనిమిదేళ్లు రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యమే కొన సాగుతుందన్నారు. శుక్రాచార్యుడు ఫామ్ హౌస్ నుంచి ఊర్లమీదకు మారీచుడు, సుబాహును పంపించాడని హరీష్ రావు, కేటీఆర్ లపై సెటైర్లు వేశారు. వాళ్లు మేం చేసే అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ కు నోటీసులు ఇస్తే పెద్ద రాద్ధాంతం చేస్తున్నారని, ట్యాపింగ్ లాంటి చిల్లర పనులకు నోటీసులు ఇవ్వక ఏం చేస్తారని ప్రశ్నించారు.కేసీఆర్ చరిత్రను చెరిపేసే ప్రయత్నం చేస్తున్ననని నన్ను హరీష్, కేటీఆర్ విమర్శిస్తున్నారని, కేసీఆర్ దొంగ పాస్ పోర్టుల చరిత్ర నేను చెరిపేస్తే చెరిగేదా అంటూ బీఆర్ఎస్ పై సంచలన ఆరోపణలు చేశారు. తెలంగాణ చరిత్ర ఉన్నంత కాలం పాపాల భైరవుడి చరిత్ర చెరిగిపోదని కేసీఆర్ పై సెటైర్లు వేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ది ఫెవికాల్ బంధమని రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు గుప్పించారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ను భారీ మెజార్టీతో గెలిపించుకొవాలని ప్రజల్ని కోరారు.

## ఫోరెన్సిక్ ల్యాబ్ లో

# అగ్ని ప్రమాదం

ఆహుతయినట్లుగా తెలుస్తోంది. సుమారు రెండు గంటల పాటు అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చినప్పటికీ, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

### - కంప్యూటర్ ల్యాబ్‌లో మొదలైన మంటలు

ఉదయం వేళ కార్యాలయం పనుల్లో నిమగ్నమై ఉన్న సమయంలో, అకస్మాత్తుగా కంప్యూటర్ ల్యాబ్ విభాగం నుంచి మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు ఇతర విభాగాలకు వ్యాపించాయి. దట్టమైన పొగలు భవనం మొత్తాన్ని కమ్మేశాయి. ఈ ప్రమాద సమయంలో లోపల ఉన్న ఒక వ్యక్తికి గాయాలు కాగా, వెంటనే అప్రమత్తమైన సహచరులు బాధితుడిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు.

### - రంగంలోకి డీసీపీ శిల్పవల్లి

ప్రమాద వార్త తెలియగానే డీసీపీ శిల్పవల్లి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అగ్నిమాపక యంత్రాలు మంటలను ఆర్పే ప్రక్రియను ఆమె స్వయంగా పర్యవేక్షించారు. ఫోరెన్సిక్ ల్యాబ్ వంటి అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే చోట అగ్నిప్రమాదం జరగడంపై ఆమె అధికారులను ఆరా తీశారు. అసలు మంటలు ఎలా మొదలయ్యాయి? షార్ట్ సర్క్యూట్ కారణమా లేక మరేదైనా కారణం ఉందా? అనే కోణంలో ప్రాథమిక విచారణ చేపట్టారు.

### - కీలక సాక్ష్యాలు బుగ్గిపాలు

ఈ ప్రమాదంలో అత్యంత ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే.. కంప్యూటర్ ల్యాబ్‌లో ఉన్న అనేక కీలకమైన కేసుల డేటా , భౌతిక పత్రాలు కాలి బూడిదయ్యాయి. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన పలు నేరాలకు సంబంధించిన డిజిటల్ సాక్ష్యాలు, ఫోరెన్సిక్ విశ్లేషణలు ఈ ల్యాబ్‌లోనే ఉన్నాయి. సాక్ష్యాలు బుగ్గిపాలు కావడంతో ఆయా కేసుల విచారణపై ఈ ప్రభావం పడే అవకాశం ఉందని న్యాయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### - కుట్ర కోణం ఉందా.?

సాధారణంగా ఫోరెన్సిక్ కార్యాలయాల్లో ఫైర్ సేఫ్టీ వ్యవస్థలు పకడ్బందీగా ఉంటాయి. అలాంటిది కంప్యూటర్ ల్యాబ్‌లోనే మంటలు రావడం, కీలక పత్రాలు ఉన్న చోటే ప్రమాదం తీవ్రత ఎక్కువగా ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. ఎవరైనా కావాలనే సాక్ష్యాలను రూపుమాపడానికి ఈ పని చేశారా? అనే కుట్ర కోణం పై పోలీసులు దృష్టి సారించారు. ల్యాబ్‌లోని సీసీటీవీ విజువల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకునే ప్రయత్నంలో ఉన్నారు.

### - విచారణ ముమ్మరం

క్లూస్ టీమ్ , ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టరేట్ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్నారు. కంప్యూటర్లలోని హార్డ్ డిస్క్‌లు ఎంతవరకు దెబ్బతిన్నాయి, వాటి నుంచి డేటాను రికవరీ చేసే అవకాశం ఉందా అనే దానిపై ఐటీ నిపుణుల సలహాలు తీసుకుంటున్నారు. ఈ ఘటనపై ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఫోరెన్సిక్ నివేదికలు తారుమారైతే నేరస్తులకు మేలు జరుగుతుందనే కోణంలో పోలీసులు అత్యంత జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు.

# తెలంగాణలో "పంచనగరి"

హైదరాబాద్ తర్వాత అతి పెద్ద నగరాలుగా వరంగల్, కరీంనగర్ పట్టణాలు నిలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి సరికొత్త, వినూత్నమైన విజన్‌ను ఆవిష్కరించారు. ఇప్పటికే 'ఫ్యూచర్ సిటీ' పేరుతో హైదరాబాద్ రూపురేఖలను మారుస్తున్న ప్రభుత్వం తాజాగా వరంగల్ ట్రై సిటీలు– హుజూర్‌నగర్, కరీంనగర్ నగరాలను కలిపి 'పంచనగరి' గా తీర్చిదిద్దే బృహత్తర సంకల్పం తీసుకుంది. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా.. కరీంనగర్ జిల్లాలో పర్యటించిన సీఎం రేవంత్ చేసిన ప్రకటన ఉత్తర తెలంగాణ భవిష్యత్తును మార్చే ఒక మాస్టర్ ప్లాన్‌లా కనిపిస్తోంది.
ప్రస్తుతం హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలుగా ఉండగా సైబరాబాద్‌తో కలిపి అది ట్రై సిటీగా మారింది. ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీ పూర్తయితే అది క్వాడ్ సిటీ అవుతుంది. అయితే, ఉత్తర తెలంగాణ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని వరంగల్, హన్మకొండ, కాజీపేట (త్రినగరి) ప్రాంతాలను కరీంనగర్, హుజూరాబాద్‌లతో అనుసంధానిస్తూ ఒకే 'సిటీ బెల్ట్'గా మార్చాలని రేవంత్ ప్లాన్ చేస్తున్నారు. ఇదే రేవంత్ రెడ్డి కలలుగంటున్న 'పంచనగరి'.

### - అభివృద్ధే ధ్యేయంగా..

హైదరాబాద్ నగరంపై విపరీతమైన ఒత్తిడిని తగ్గించి, ఉపాధిని వికేంద్రీకరించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశంగా తెలుస్తోంది. ఈ కారిడార్‌లో వరంగల్, కరీంనగర్ నగరాల వెలుపల రింగ్ రోడ్లను (ఓఆర్ఆర్) నిర్మించి, వాటిని అనుసంధానించడం ద్వారా రవాణా వేగవంతం చేయటం లక్ష్యంగా పెట్టుకున్నారు. రెండు నగరాల మధ్య భారీ ఇంటిగ్రేటెడ్ డంప్ యార్డ్‌ను ఏర్పాటు చేసి, బయో వేస్ట్ పవర్ ప్లాంట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయడం, ఐటీ సెక్టార్ హబ్‌లను ఏర్పాటు చేయడంతో పాటు, ఇతర ఉపాధి మార్గాలకు ఈ ప్రాంతాన్ని కేంద్రంగా మార్చటం లక్ష్యంగా పెట్టుకున్నారు. వరంగల్‌లోని మామునూరు విమానాశ్రయం పూర్తి చేయడం, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ఏర్పాటు ఈ ప్రాజెక్టులో కీలకంగా మారనున్నాయి.
రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను రేవంత్ రెడ్డి మూడు మండలాలుగా విభజించారు. క్యూర్: హైదరాబాద్ ఓఆర్ఆర్ లోపల ఉండే కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ, ప్యూర్: ఓఆర్ఆర్, ప్రతిపాదిత ప్రాంతీయ రింగ్ రోడ్ మధ్య ఉన్న తయారీ రంగం. రేర్: రీజినల్ రింగు రోడ్డుకు ఆవల ఉండే వ్యవసాయ అనుబంధ రంగాల ప్రాంతం. ఈ విభజనలో వరంగల్–కరీంనగర్ కారిడార్ తెలంగాణకు మరో హైదరాబాద్‌లా నిలవనుంది. తెలంగాణ అభివృద్ధి అంటే కేవలం హైదరాబాద్ మాత్రమే కాకుండా టైర్–2 నగరాలను ఆర్థికంగా బలోపేతం చేయడం ద్వారా సమతుల్య అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. వరంగల్ ఇప్పటికే విద్యా కేంద్రంగా ఉంది. దానికి కరీంనగర్ పారిశ్రామిక శక్తి తోడైతే ఉత్తర తెలంగాణ ఒక శక్తివంతమైన గ్రోత్ ఇంజిన్‌గా మారనుంది. స్థానిక యువతకు ఉపాధి లభించడమే కాకుండా, రియల్ ఎస్టేట్, వ్యాపార రంగాలు కొత్త పుంతలు తొక్కే ఛాన్స్ ఉంది.

## త్వరలోనే మలేషియాలో

# తొలి భారత కాన్సులేట్

'సెలామత్ దతాంగ్ మోదీజీ' కార్యక్రమంలో ఆయన ఈ ప్రకటన చేశారు. ఈ కార్యక్రమానికి మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో కలిసి మోదీ హాజరయ్యారు. కాన్సులేట్ ఏర్పాటు నిర్ణయంతో ఇరు దేశాల మధ్య బంధం మరింత బలపడుతుందని ప్రధాని మోదీ తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో పేర్కొన్నారు. ఈ చొరవతో మలేషియాలోని భారతీయ సమాజంతో సంబంధాలు మరింత విస్తృతం అవుతాయని భారత విదేశాంగ శాఖ (ఎంఈఏ) తెలిపింది. ప్రధాని ప్రకటనపై అక్కడి ప్రవాస భారతీయులు హర్షం వ్యక్తం చేశారు. అంతకుముందు ఆరో తరం వరకు ఉన్న మలేషియాలోని భారత సంతతి పౌరులకు ఓవర్సీస్ సిటిజన్‌షిప్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) కార్డుల అర్హతను పొడిగించడంపై ప్రవాస భారతీయులు సంతోషంగా ఉన్నారని మోదీ తెలిపారు.
ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, మలేషియా అభివృద్ధికి, ఇరు దేశాల స్నేహాన్ని బలోపేతం చేయడంలో భారత సంతతి ప్రజల పాత్రను కొనియాడారు. భారత్–మలేషియా భాగస్వామ్యాన్ని ఆయన 'ఇంపాక్ట్'గా అభివర్ణించారు. ఆజాద్ హింద్ ఫౌజ్ చరిత్రను గుర్తుచేసుకుంటూ నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు నివాళులర్పించారు. ఆహారపు అలవాట్ల నుంచి భాష వరకు ఇరు దేశాల మధ్య అనేక సాంస్కృతిక సారూప్యతలు ఉన్నాయని గుర్తుచేశారు. ఈ పర్యటనలో భాగంగా మరికొన్ని కీలక ప్రకటనలు కూడా చేశారు. కౌలాలంపూర్‌లోని యూనివర్సిటీ మలయాలో ప్రత్యేకంగా 'తిరువళ్లువార్ సెంటర్' ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. దీంతో పాటు విద్యార్థుల కోసం తిరువళ్లువార్ స్కాలర్‌షిప్‌లను కూడా అందిస్తామని హామీ ఇచ్చారు. భారత్ ఆర్థికంగా వేగంగా అభివృద్ధి చెందుతోందని, త్వరలోనే యూపీఐ చెల్లింపుల సౌకర్యం మలేషియాలోనూ అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా 800 మంది కళాకారులతో ప్రదర్శించిన భారత సంప్రదాయ నృత్య ప్రదర్శన మలేషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించడం విశేషం.

# రేవంత్ ఏనాటికైనా బీజేపీ మనిషే

అని అన్నారు. రాష్ట్రంలోని మైనారిటీలు, మత రాజకీయాలను వ్యతిరేకించే ప్రతి ఒక్కరూ రేవంత్ రెడ్డి కప్పుకున్న బీజేపీ ముసుగును తొలగించి చూడాలని ఆయన లోపల ఉన్న బీజేపీ నాయకుడిని గుర్తించాలని కోరారు.అధికారంలో ఉన్నామని, వారికే ఓటు వేయాలని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారని మరి రెండేళ్లలో వారి ప్రభుత్వం ఏం చేసిందని కేటీఆర్ ప్రశ్నించారు. మరో రెండేళ్ల తర్వాత తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. అప్పుడు ఖచ్చితంగా పట్టణాలను కాంగ్రెస్ కంటే గొప్పగా అభివృద్ధి చేస్తామని అన్నారు.మైనారిటీలకు, బీసీలకి భారీ ఎత్తున బడ్జెట్ ఇస్తామని చెప్పి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ఖచ్చితంగా ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కేటీఆర్ కోరారు. కాంగ్రెస్ హామీలు అమలు అయితే ఆ ప్రయోజనాలు పొందిన వాళ్లు మాత్రమే వారికి ఓటు వేయాలని అన్నారు. మిగిలిన వాళ్లు కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. పెన్షన్ రూ. 4000, మహిళలకు రూ. 2,500, రైతు భరోసా, కళ్యాణ లక్ష్మి, తులం బంగారం వచ్చిన వాళ్లు మాత్రమే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీలోకి పోచారం శ్రీనివాస్ రెడ్డి ఎందుకు పోయారో బాన్సువాడ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.అసెంబ్లీ ఎన్నికలకు ముందు పోచారంను రేవంత్ రెడ్డి బండ బూతులు తిట్టారని, అవినీతి ఆరోరపణలు చేశారని, మరి అలాంటి పార్టీలోకి ఆయన ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. కేసీఆర్ బాన్సువాడను అభివృద్ధి చేశారని, జీవితాంతం రుణపడి ఉంటానని కూడా పోచారం చెప్పారని మరి ఇన్ని మాటలు చెప్పిన వ్యక్తి ఎందుకు కాంగ్రెస్‌లో చేరారని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి విసిరే ఎంగిలి మెతుకుల కోసం పోచారం కాంగ్రెస్ సంకలో చేరారని సంచలన ఆరోపణలు చేశారు. అయినప్పటికీ వేల మంది పార్టీ కార్యకర్తలు, నాయకులు ఇంకా బీఆర్ఎస్‌లోనే ఉన్నారని అన్నారు.బాన్సువాడలో బీఆర్ఎస్ గెలవాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పుకొచ్చారు. కేవలం డబ్బులు ఉన్నంత మాత్రాన పెద్ద నాయకుడు అవ్వలేరని పోచారం శ్రీనివాస్ రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. పోచారంకు దమ్ముంటే రాజీనామా చేసి ఎన్నికలకు వెళ్లాలని అప్పుడు ప్రజలు ఎవరి వైపు ఉంటారో తెలుస్తుందని సవాల్ విసిరారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే బాన్సువాడ అభివృద్ధి జరిగిందని చెప్పారు. బాన్సువాడకు జరిగిన అభివృద్ధి అంతా ఖచ్చితంగా కేసీఆర్ ప్రభుత్వానికే చెందుతుందని ఒకవేళ నిజంగానే పోచారం అభివృద్ధి చేసి ఉంటే గత రెండు సంవత్సరాల్లో చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరిన తర్వాత బాన్సువాడకు ఏం లాభం జరిగిందని ప్రశ్నించారు.

# క్యాబ్ డ్రైవర్ల అందోళన

**రాజేంద్రనగర్** దేశవ్యాప్తంగా ర్యాపిడో, ఓలా, ఉబెర్ డ్రైవర్ల స్ట్రైక్ చేపట్టింది. ఈ రోజు "ఆల్ ఇండియా బ్రేక్ డౌన్ " కు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఓలా, ఉబర్, రాపిడో డ్రైవర్లు సమ్మె చేస్తున్నారు . యాప్ ఆధారిత క్యాబ్ డ్రైవర్ల ఆందోళనకు దిగారు. డ్రైవర్లు యాప్లను ఆఫ్ చేసి రైడ్స్ను నిరాకరిస్తున్నారు. పలు నగరాల్లో క్యాబ్ సర్వీసులు పూర్తిగా నిలిచిపోయాయి. కనీస బేస్ ఫేర్ లేకపోవడంపై డ్రైవర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. డ్రైవర్ల స్ట్రైక్ ను పాటించకుండా నడుపుతున్న వారిపై బలవంతంగా వాహనాలను రోడ్ పై ఆపి ప్రయాణికులకు ఇబ్బందులు కలిగించారు. అయితే, యాప్ కంపెనీల ఇష్టారాజ్యంగా ధరల నిర్ణయంతో డ్రైవర్ల ఆదాయం తగ్గుతుంది. కంపెనీలు ఎక్కువ కమిషన్లు వసూలు చేస్తున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన కనీస ప్రయాణ ఛార్జీలు అమలు చేయాలంటున్నారు.

ఫేర్ నిర్ణయంలో యాప్ కంపెనీల ఏకపక్ష నిర్ణయాలకు ముగింపు పలకాలని డ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారు. ప్రైవేట్ వాహనాలతో కమర్షియల్ రైడ్స్ నిషేధించాలని డిమాండ్ చేస్తున్నారు. డిమాండ్స్ నెరవేర్చకపోతే మరింత తీవ్రమైన ఉద్యమాలు, భవిష్యత్తులో దీర్ఘకాలిక స్ట్రైక్ చేస్తామని ర్యాపిడో, ఓలా, ఉబెర్ డ్రైవర్లు హెచ్చరిస్తున్నారు.

# ఫోరెన్సిక్ ల్యాబ్లో భారీ అగ్నిప్రమాదం

**హైదరాబాద్** హైదరాబాద్ నాంపల్లిలోని ఫోరెన్సిక్ ల్యాబ్లో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. భవనం మొదటి అంతస్తులో ఒక్కసారిగా మంటలు ఎగసిపడటంతో పరిసర ప్రాంతమంతా దట్టమైన పొగతో నిండిపోయింది.

సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేసారు. భారీగా పొగ కమ్ముకోవడంతో సహాయక చర్యలు కష్టతరంగా మారాయి.

# ఈద్గా మైదానం కోసం ముస్లింల అందోళన

**హైదరాబాద్** బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 10 లోని ఐఏఎస్ ఐపీఎస్ క్వార్టర్స్ ను ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఈద్గా మైదానంగా ప్రకటించాలని మైనారిటీలు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. తాజాగా ప్రభుత్వం ఈ స్థలాన్ని రిజిస్ట్రేషన్ శాఖతోపాటు, విద్యుత్ శాఖకు కేటాయించింది. ప్రభుత్వ శాఖలకు ఈ స్థలాన్ని కేటాయించడంతో తమకు ప్రార్థనలు చేసుకోవడానికి, స్థానికంగా ఉండే యువతకు క్రీడామైదానం పోతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## బెల్లంపల్లి ఫుడ్ పాయిజన్ ఘటనపై..

# ఎమ్మెల్సీ మల్క కొమరయ్య సీరియస్

**బెల్లంపల్లి** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ ఘటనపై ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య మండిపడ్డారు. విషయం తెలుసుకొని శనివారం హుటాహుటిన బెల్లంపల్లి ప్రభుత్వ అస్పత్రికి వెళ్లి విద్యార్థినులను పరామర్శించారు. బాధిత విద్యార్థినులతో మాట్లాడి ఫుడ్ పాయిజన్ ఘటనపై ఆరా తీసారు. విద్యార్థినుల క్షేమ సమాచారం తెలుసుకొని.. వారికి మెరుగైన వైద్యం అందించాలని అస్పత్రి సూపరింటెండెంట్, డాక్టర్స్ అస్పత్రి సిబ్బందిని ఆదేశించారు. ప్రతిసారి గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ ఎందుకు జరుగుతోంది. అధికారుల పర్యవేక్షణ ఎందుకు కొర్వడుతోంది? పై విషయాలపై పూర్తి స్థాయి విచారణ చేసి సమగ్ర రిపోటర్ ఇవ్వాలని ఆదేశించారు.

ఈ ఘటనకు బాధ్యులు ఎవరో నిగ్గు తెల్చాలి, మళ్ళీ ఇలాంటివి జరగకుండా చూడాలని ఆదేశించారు. ఫుడ్ పాయిజన్ ఎందుకు జరిగింది, విద్యార్థిలు ఇలాంటి ఫుడ్ తీసుకోవడం వాళ్ళ అశ్వస్థ కు గురయ్యారు... ఇలాంటివి జరగకుండా ఇలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో రిపోర్ట్ హెల్త్ డైరెక్టర్ కు పంపాలని ఆదేశించారు.
ఎమ్మెల్సీ మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ జరగడం బాధాకరం. ఇది పూర్తిగా గురుకులాలపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం . పిల్లల ప్రాణాలంటే మీకు లెక్కలేదా..? ఎన్ని సార్లు రిపీట్ అవుతాయని అన్నారు. గురుకులాలపై పర్యవేక్షణ లేకపోవడం వల్లే తరుచూ ఇలాంటి ఘటనలు . ఈ ఫుడ్ పాయిజన్ ఘటనపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు.

# సాగులో ఉన్న భూములకే రైతు భరోసా

## – వచ్చే యాసంగి నుంచే కొత్త విధానం!

**హైదరాబాద్** తెలంగాణ రాష్ట్రంలో రైతు భరోసా వచ్చే యాసంగి నుంచే కొత్త విధానం శాటిలైట్ మ్యాపింగ్ ఆధారంగా సాయంసర్వే , గ్రౌండ్ ట్రూత్ వివరాలతో పెట్టుబడి సాయం ఇచ్చే యోచనలో సర్కారువానాకాలం డేటానే ప్రామాణికం.ఇప్పటికే అందుబాటులోకి వచ్చిన సర్వే వివరాలు:రాష్ట్రంలో ఉన్న పట్టా భూమిలో 20 లక్షల ఎకరాల్లో సాగు తేడా,త్వరలోనే ప్రభుత్వానికి అగ్రికల్చర్ వర్సిటీ తుది నివేదిక తెలంగాణ రాష్ట్రంలో 'రైతు భరోసా' పంపిణీపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోబోతున్నది. ఇకపై పట్టా ఉన్న ప్రతి భూమికీ కాకుండా, వాస్తవంగా సాగులో ఉన్న భూములకు మాత్రమే పెట్టుబడి సాయం అందించాలని యోచిస్తున్నది. రాబోయే యాసంగి సీజన్ నుంచే ఈ కొత్త నిబంధనలను అమలు చేసేందుకు కసరత్తు వేగవంతం చేసింది. వానాకాలం సీజన్‌లో జరిగిన సాగు వివరాలను ప్రాతిపదికగా తీసుకొని, అర్హులైన రైతులకు నగదు జమ చేయాలని భావిస్తున్నది. కేవలం కాగితాల్లో ఉన్న లెక్కలకే పరిమితం కాకుండా, ఆధునిక సాంకేతికతను ప్రభుత్వం రంగంలోకి దించింది. అగ్రికల్చర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన శాటిలైట్ మ్యాపింగ్ ప్రక్రియ ఇప్పటికే పూర్తయ్యింది. రాష్ట్రంలో ఉన్న పట్టాభూమిలో 8--12% సాగులో తేడా 20 లక్షల ఎకరాలు,కనిపిస్తున్నట్టు తేలింది.శాటిలైట్ సర్వే వివరాలను సర్కారుకు అగ్రికల్చర్ యూనివర్సిటీ త్వరలోనే అందించనున్న నేపథ్యంలో ఈ డేటా కీలకంగా మారునున్నది. శాటిలైట్ ఆధారిత మ్యాపింగ్ ద్వారా సాగు భూములను గుర్తించడంతోపాటు గ్రౌండ్ లెవెల్‌లో పక్కాగా గుర్తించి, అర్హులకు మాత్రమే సాయం అందించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నది.20 లక్షల ఎకరాలు ఖాళీ:అగ్రికల్చర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో 10,600 రెవెన్యూ గ్రామాల్లో పంటల విస్తీర్ణం లెక్కలు పూర్తి చేశారు. విలేజ్ రెవెన్యూ మ్యాప్‌లు లేని 870 గ్రామాలను మినహాయించి మిగిలిన ప్రాంతాల్లో విశ్లేషణ పూర్తిచేశారు. రాష్ట్రంలో సాగుకు యోగ్యమైన మొత్తం భూమి 1.53 కోట్ల ఎకరాలు కాగా, ఇందులో 8 నుంచి 12 శాతం వరకు అంటే సుమారు 20 లక్షల ఎకరాలకు పైగా భూమిని పంటలు వేయకుండా ఖాళీగా ఉంచినట్టు సర్వేలో తేలింది. గత వానాకాలం పంటల విస్తీర్ణానికి సంబంధించిన పూర్తి నివేదిక త్వరలోనే ప్రభుత్వం చేతికి అందనున్నది. దేశంలోనే మొదటిసారిగా శాటిలైట్ ఆధారిత టెక్నాలజీతో పంటల విస్తీర్ణం లెక్కింపును చేపట్టగా.. నీటి లభ్యత తక్కువగా ఉన్న జిల్లాల్లో ఖాళీ భూముల శాతం అధికంగా ఉన్నట్టు తేలింది. ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో సాగునీటి సౌకర్యాలు తక్కువ కావడంతో అక్కడ ఖాళీ భూములు ఎక్కువగా కనిపిస్తున్నాయి. నీటి వసతి మెరుగ్గా ఉన్న జిల్లాల్లో సాగు చేయకుండా ఉంచిన భూములు తక్కువగా ఉన్నట్టు అధ్యయనంలో తేలింది. ఒక గ్రామంలో 500 ఎకరాల సాగు యోగ్య భూమి ఉంటే, 400 నుంచి 450 ఎకరాల్లో మాత్రమే పంటలు వేస్తున్నారని శాటిలైట్ ఇమేజెస్ స్పష్టం చేశాయి.92 శాతం కచ్చితత్వం:శాటిలైట్ సర్వేకు యూరోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన ఇమేజెస్‌ను ప్రతి 12 రోజులకు సేకరిస్తున్నారు. స్విట్జర్లాండ్‌కు చెందిన సార్ మ్యాప్ ఎస్ఏఆర్ ఎంఏపీ, సంస్థతో ఒప్పందం చేసుకుని, ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా డేటాను విశ్లేషిస్తున్నారు. 4 నెలల పంట కాలంలో 10 సార్లు శాటిలైట్ ఇమేజెస్ ఆధారంగా విశ్లేషణ చేసి, 92 శాతం కచ్చితత్వాన్ని సాధిస్తున్నట్టు క్షేత్ర స్థాయి పరిశీలనల్లో తేలింది. ప్రభుత్వ ఆధ్వర్యంలో యూనివర్సిటీలో అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్లు, రిమోట్ సెన్సింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్థిక సహకారంతో ఈ టెక్నాలజీని అమలు చేస్తున్నారు. మున్ముందు సొంతంగానే ఈ వ్యవస్థను నడపాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.పంటల బీమా నుంచి పారదర్శకత వరకు:ఈ శాటిలైట్ మ్యాపింగ్‌తో పంట బీమా అమలులో రైతులకు నష్టపరిహారం సకాలంలో అందడమే కాకుండా, వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ, కొనుగోళ్లు, అమ్మకాల్లో



పారదర్శకత తీసుకురావడానికి ఉపయోగపడనుంది. ప్రభుత్వ పథకాలు అర్హులైన రైతులకే చేరేలా ఈ లెక్కలు సహాయపడతాయి. సాగు భూములను మరింత సమర్థవంతంగా వినియోగించుకోవడానికి క్షేత్ర స్థాయి అధికారులు విశ్లేషణ చేస్తారని అధికారులు చెప్తున్నారు. చీడపీడలు, వరదలు, తుఫానుల వల్ల జరిగే పంట నష్టాన్ని అంచనా వేయడానికి కూడా ఈ టెక్నాలజీని వినియోగిస్తారు.పైలెట్ ప్రాజెక్టు సక్సెస్.. రాష్ట్రవ్యాప్త అమలుకు సన్నాహాలు:గతంలో పంటల నమోదు కోసం ప్రత్యేక యాప్‌ను అందు బాటులోకి తెచ్చిన ప్రభుత్వం. 20 జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టుగా శాటిలైట్ సర్వే నిర్వహించింది. నిరుడు డిసెంబర్ 20 నుంచి 23 వరకు ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, జగిత్యాల, వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి, ఖమ్మం, కొత్తగూడెం, వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట్, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో ఈ సర్వే జరిగింది. 144 మండలాల్లోని 318 క్లస్టర్లలో ప్రక్రియ పూర్తి చేసి, సాగు భూములను కచ్చితంగా లెక్కించారు.ఇదివరకే నిర్ణయం:సాగులో ఉన్న భూములకు మాత్రమే రైతు భరోసా ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇదివరకే నిర్ణయించింది. ఈ విషయాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఇప్పటికే స్పష్టం చేశారు. సాగు భూముల గుర్తింపు కోసం శాటిలైట్ సర్వే నిర్వహిస్తారని, గ్రామాల్లో సర్వే నంబర్లవారీగా ఏఈవోలు క్షేత్రస్థాయిలో పర్యటించి కచ్చిత వివరాలు సేకరించి లోటు పాట్లు సరిచేస్తారని సమాచారం. అగ్రికల్చర్ యూనివర్సిటీ రూపొందించిన పంటల వివరాలను ఈనెల 14 తర్వాత సర్కారుకు అందిస్తే, టెక్నికల్ కమిటీలో చర్చించి దీనిపై నిర్ణయం తీసుకోనున్నది.

## ఎంపీ కేశినేని శివనాథ్ క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బారు

- ప్రజాసమస్యల సత్వర పరిష్కారమే ప్రజాదర్బారు లక్ష్యం.
- ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా సమస్యల పరిష్కారం.
- పశ్చిమ నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ నాయకులు వెల్లడి
- అర్జీలతో భారీగా తరలివచ్చిన ప్రజానీకం

విజయవాడ : పశ్చిమ నియోజకవర్గంలోని ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఆదేశాల మేరకు శనివారం 53వ డివిజన్ గణపతి రావు రోడ్డులో గల ఎంపీ కేశినేని శివనాథ్ క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ జరిగింది. ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో కలిసి టిడిపి నాయకులు ఈ ప్రజాదర్బార్ నిర్వహించారు ప్రజాదర్బార్ కి అధిక సంఖ్యలో ప్రజలు తమ సమస్యలపై అర్జీలతో తరలిరావటం జరిగింది. ఈ ప్రజా దర్బార్ కార్యక్రమంలో టిడిపి నాయకులు ప్రజలతో స్వయంగా మాట్లాడి వారి నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రతి అర్జీపై సంబంధిత శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు అందించారు. అధికారులు కొన్ని అర్జీలను అక్కడిక్కడే పరిష్కరించారు.ఈ ప్రజా దర్బార్ లో రేషన్ కార్డ్ మ్యాపింగ్, కొత్త రేషన్ కార్డ్, టిడ్కో ఇళ్లు, ఇంటి స్థలాలు, వితంతు, ఒంటరి మహిళల పెన్షన్లు, దివ్యాంగుల పెన్షన్లు, ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ సమస్యలు, సీనియర్ సిటిజన్ సమస్యలపై ప్రజలు ఎక్కువగా అర్జీలు పెట్టుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యం జరగకూడదనే ఉద్దేశ్యంతో ఎంపీ కేశినేని శివనాథ్ ఆదేశాల మేరకు పశ్చిమ నియోజకవర్గంలో ప్రతివారం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు పశ్చిమ నియోజకవర్గ టిడిపి నాయకులు తెలిపారు. ప్రజల ఆకాంక్షలను, నమ్మకాన్ని నిలబెట్టుకునేలా ఎన్డీయే కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు.

## ఆయిల్ ఫామ్ పంటను పండించేందుకు ముందుకు రావాలి

### – మంత్రి తుమ్మల

**సిద్దిపేట** మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్రం మార్క్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి తో కలిసి నంగునూరు మండలం నర్మెట్ట లో గల ఆయిల్ఫెడ్ ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని సందర్శించారు.

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలో ఈ సందర్భంగా మంత్రి మాట్లడుతూ ఈనెల చివరిలో గాని వచ్చే నెల మొదటి వారంలో గాని రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభించేందుకు ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని పరిశీలించామన్నారు. చిన్న చిన్న పనులు మరియు క్లీనింగ్ తప్ప దాదాపు పనులు పూర్తయ్యాయి. నాలుగు మెగావాట్ల కెపాసిటీ గల ఆయిల్ ఫామ్ పిప్పి తో కూడిన వ్యర్థాలతో విద్యుత్ జనరేషన్ చేసే ప్లాంట్ కూడా పూర్తవుతుంది. పనులు మొత్తం పూర్తిగా గానే ఫ్యాక్టరీ ప్రారంభించడానికి ముఖ్యమంత్రి సమయం కోరుతానని అన్నారు.ఫ్యాక్టరీ లోనే మూడు రోజులపాటు రైతు మేళ నిర్వహించి ఆయిల్ ఫామ్ పంటలకు సంబంధించిన స్టాళ్లను ఏర్పాటు చేసి వ్యవసాయ యాంత్రికరణ, అదునాతన వ్యవసాయ పద్ధతులపై ప్రదర్శన మరియు శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులచే రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాము. 120 మెట్రిక్ టన్నుల వరకు గెలలను ప్రాసెస్ చేసే అవకాశం ఉన్న ఈ ఫ్యాక్టరీ ఉత్తర తెలంగాణ వరప్రదాయంగా మారుతుంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో పండిన ఆయిల్ ఫామ్ పంటను ఇక్కడ ప్రాసెస్ చేసే కెపాసిటీ ఈ ఫ్యాక్టరీ కి ఉంది. రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు తీసుకున్న మొదటి రోజే నర్మెట్ట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి సంబంధించిన సంతకం పెట్టిన. ఒకటిన్నర సంవత్సరంలోనే ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తి చేశాము. ఆరోజు ఆయిల్ ఫామ్ గెల ఒక మెట్రిక్ టన్నుకు 12000 రూపాయలు మాత్రమే ఉండే ఇప్పుడు 24,456 రూపాయలుగా పెరిగింది. మన రాష్ట్రంలో నిర్ణయించే ఆయిల్ ఫామ్ గెలల ధరనే దక్షిణ భారత దేశంలో అమలవుతుందని అన్నారు. రాష్ట్రంలో మూడు, నాలుగు సంవత్సరాల నుండి ఆల్ఫా మొక్కలను పెట్టడం జరిగింది అవి కోతకు రాగానే ఫ్యాక్టరీ అందుబాటులో ఉండాలని వేగంగా నిర్మించడం జరిగింది. ముఖ్యమంత్రి ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని ప్రారంభించడంతో పాటు ఆయిల్ రిఫైనరీ యూనిట్ నిర్మించడానికి శంకుస్థాపన చేయడం జరుగుతుంది. దేశంలో ప్రస్తుతం 12 లక్షల ఎకరాలలో ఆయిల్ ఫామ్ పంట సాగు అవుతుంది. ఇంకా దేశంలో 70 లక్షల ఎకరాల్లో ఆయిల్ ఫామ్ పంట సాగు చేయవలసిన అవసరం ఉంది. సిద్దిపేట జిల్లాలో 14 నుండి 15 వేల ఎకరాలలో ఆయిల్ ఫామ్ పంట సాగు అవుతుంది. లక్ష కోట్ల రూపాయల విలువైన ఆయిల్ ను ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకుంటున్నాము. రైతులకు ఎలాంటి నష్టం కలగజేయని ఆయిల్ ఫామ్ పంటను పండించేందుకు ముందుకు రావాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ డైరెక్టర్ మరియు ఆయిల్ ఫెడ్ ఎండి యాస్మిన్ భాష, ఫ్యాక్టరీ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా ఉద్యానవన అధికారి సువర్ణ, జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప రాణి, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, ఆయిల్ ఫెడ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులకు అస్వస్థత

### – తెలిసినా పట్టించుకోని వార్డెన్

**బెల్లంపల్లి** ఫుడ్ పాయిజన్ విషయం బయటకు తెలిస్తే పరువు పోతుందని విద్యార్థినులకు హాస్టల్ వార్డెన్ ఆర్ఎంపీ వైద్యుడితో చికిత్స చేయించారు. 108కి కాల్ చేయమని విద్యార్థినులు వేడుకున్నా.. కనికరించకుండా అలాగే చూస్తూ హాస్టల్ సిబ్బంది కూర్చున్నారు. అన్నంలో పురుగులు వచ్చాయని తెలిపినా పడేయకుండా అలానే తినాలని విద్యార్థినులపై కర్కశత్వం ప్రదర్శించారు.బెల్లంపల్లి ప్రభుత్వ ఎస్సీ బాలికల హాస్టల్ ఫుడ్ పాయిజన్ ఘటనలో విస్తుగొలిపే విషయాలు బయటపడ్డాయి. అన్నంలో పురుగులొచ్చి 40 మంది విద్యార్థినులు అస్వస్థత కు గురయ్యారు. తీవ్ర వాంతులు చేసుకొని, కళ్ళు తిరిగి, ఎక్కడికక్కడే కుప్పకూలారు. విషయం బయటకు తెలిపిస్తే పరువు పోతుందని అస్వస్థతకు గురైన విద్యార్థినులకు ఆర్ఎంపీ వైద్యుడితో ఇంజక్షన్, టాబ్లెట్ ఇప్పించారు. సాయంత్రం 7:30 గంటలకు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారని ఫోన్ చేసి తెలపగా, రాత్రి 10 గంటలకు హాస్టల్ వద్దకు వెళ్లారు. ఆ మూడు గంటలు నరకం అనుభవించామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేసారు.

## బైక్ కొనివ్వలేదని తండ్రిని హతమార్చిన కొడుకు


**మెదక్** బైక్ కొనివ్వలేదని తండ్రిని కొడుకు హతమార్చిన ఘటన ఇది. మెదక్ జిల్లా రేగోడ్ మండల కేంద్రంలో షకీర్(51) అనే వ్యక్తి కూరగాయలు అమ్ముతూ జీవనం సాగిస్తున్నాడు. గత కొంత కాలంగా తనకు బైక్ కొనివ్వాలని, భూమి అమ్మి డబ్బులు ఇవ్వాలని తల్లిదండ్రులను షకీర్ కొడుకు మొహమ్మద్ హుస్సేన్ వేధిస్తున్నాడు. నెల రోజుల క్రితం డబ్బులు ఇవ్వడంలేదని తండ్రిపై దాడి చేయగా, ఇద్దరి మధ్య గ్రామ పెద్దలు రాజీ కుదిర్చారు. ఈ నేపథ్యంలో రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న తండ్రిని, బయటికి లాక్కొచ్చి కొట్టడంతో షకీర్ తీవ్ర గాయాలపాలయ్యి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కాంగ్రెస్‌లో వర్గపోరు

### రెబెల్స్ వ్యవహారం పై టీపీసీసీ సీరియస్

**హైదరాబాద్** జగిత్యాల కాంగ్రెస్ లో వర్గవిభేదాలపై పార్టీ స్పందించింది. సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ పెద్దలు చర్యలకు సిద్ధమయ్యారని సమాచారం. జగిత్యాలలో బీఆర్ఎస్ పార్టీ తరపున గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన ఎమ్మెల్యే సంజయ్ మనుషులకి బీ ఫారం ఇచ్చి, తన అనుచరులకు బీ ఫారం ఇవ్వకుండా మోసం చేశారని, జీవన్ రెడ్డి తన అనుచరులను స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దింపారు. కాంగ్రెస్ పార్టీ బీ ఫారంపై పోటీ చేస్తున్న అభ్యర్థులను, జీవన్ రెడ్డి లాంటి సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఓడించడం క్రమశిక్షణారాహిత్యంగా అధిష్ఠానం భావిస్తోంది. వర్గపోరు వల్ల ఒకరి అనుచరులను ఇంకొకరు ఓడించడం పార్టీకి నష్టం కలిగిస్తుందని అధిష్ఠానం భావిస్తోంది. మరోవైపు గద్వాల, మహబూబాబాద్ లాంటి ప్రాంతాల్లో కూడా కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు బయటపడడంతో, రెబల్ అభ్యర్థుల బలం ముందు కాంగ్రెస్ అభ్యర్థులు ఓడిపోతారని పార్టీ సీనియర్ నాయకుల భావన. దీంతో జగిత్యాలతో పాటు వర్గపోరు ఉన్న అన్ని ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి పెట్టాలని ఇన్చార్జి మంత్రులకు రేవంత్ రెడ్డి ఆదేశాలు ఇచ్చారు.

## ఎంపీ వద్దిరాజు కొత్తగూడెం 54వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం



**కొత్తగూడెం** బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మునిసిపల్ మాజీ ఛైర్ పర్సన్ కాపు సీతామహాలక్ష్మి తదితర నాయకులతో కలిసి కొత్తగూడెం 54వ డివిజన్ సవాయ్ బస్తీలో ప్రచారం నిర్వహించారు.ప్రచార కార్యక్రమంలో ఎంపీ రవిచంద్ర వెంట బీఆర్ఎస్ డివిజన్ అభ్యర్థి మాదాసు పద్మ, నాయకులు బొమ్మిడి రమాకాంత్ యాదవ్, రాజేష్ (కన్ని),బొమ్మడి శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపల్లి మండలంలోని విద్యార్థిని విద్యార్థులకు ఉచిత అద్దాలు పంపిణీ



**కొత్తపల్లి:** కొత్తపల్లి రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొనిప్రభుత్వమువిద్యతోపాటు ఆరోగ్యానికి కూడా ప్రాధాన్యత కల్పిస్తుందని ఆత్మకూరు కంటి వైద్యులు షేక్షావలి అన్నారు. శనివారము కొత్తపల్లి మండలంలోని వివిధ పాఠశాలలో కస్తూరిబా గాంధీ పాఠశాల22 మంది బాలికలకు స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల14 మంది విద్యార్థులకు మరియు గువ్వలకుంట్ల జిల్లా పరిషత్ 9 విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచిత అద్దాలుపంపిణీ చేయడం జరిగినది ఈసందర్భంగా విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో విద్యార్థులు స్మార్ట్ ఫోనుకు బానిసలు అయ్యి స్మార్ట్ ఫోన్ నిరంతరంగా చేస్తున్నారని వాటికి దూరంగా ఉండాలని అన్నారు అలాగే విద్యార్థిని విద్యార్థులు రోజువారి ఆహారంలో పోషక విలువలు మెండుగా ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవాలని మరియు పాలు గుడ్డు కూరగాయలు ఆకుకూరలు రోజు తీసుకోవాలని సూచించారు కళ్ళను జాగ్రత్తగాపరిశుభ్రంగాఉంచుకోవాలని వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ స్కూల్ ప్రిన్సిపల్ కృష్ణా భాయి కొత్తపల్లి జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ గోవులకుంట్ల జిల్లా పరిషత్ ప్రధాన ఉపాధ్యాయులు హుస్సేనయ్య ఆయా కళాశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు మరియు సి హెచ్ ఓ శైలజఆరోగ్య కార్యకర్త సరిత ఆశా కార్యకర్తలు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణ, సేవా భావానికి ప్రతీక స్కౌట్.




**రాయచోటి** క్రమశిక్షణ, సేవా భావానికి ప్రతీక స్కౌట్ అని ప్రయివేట్ విద్యాసంస్థల రాష్ట్ర జెఏసి కన్వీనర్ డా పాపిరెడ్డి మదన మోహన్ రెడ్డి, రాయచోటి తహశీల్దార్ నరసింహ కుమార్, స్కౌట్ సెక్రటరీ మడితాటి నరసింహా రెడ్డి లు అన్నారు. శనివారంరాయచోటి పట్టణం గాలివీడు రోడ్డు మార్గాన ఉన్న అర్చన కళాశాలలో ఈనెల 2వ తేదీ నుంచి 6వ తేదీ వరకు 5 రోజులపాటు స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు నిర్వహించిన ద్వితీయ సోపాన్ శిక్షణ ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారుఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ స్కౌట్ శిక్షణతో విద్యార్థులకు బంగారు భవిష్యత్తు సమకూరుతుందన్నారు. స్కౌట్ లో చేరడం ద్వారా విద్యార్థి దశ నుండే తల్లిదండ్రులతో, గురువులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించడానికి అవకాశం ఉంటుందన్నారు. నిజజీవితంలో విద్యార్థులు ఎదుర్కొనే సవాళ్లను అధిగమించడానికి స్కౌట్ శిక్షణ తోడ్పడుతుందన్నారు.అనంతరం జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల జరిగినప్పుడు ప్రథమ చికిత్స అందించి సమీపంలోని ఆసుపత్రికి చేర్చడం, గ్రామాల్లో జరిగే వివిధ కార్యక్రమాల సమయంలో స్వచ్ఛందంగా సేవలందించడం, మంచి అలవాట్ల గురించి ఈ శిక్షణలో నేర్పించడం జరిగిందన్నారు.అన్ని రకాల ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలల్లో స్కౌట్ యూనిట్లను ఏర్పాటు చేయడం తప్పనిసరి అని అన్నారు. స్కౌట్ నందు చేరి శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు విద్యా, ఉద్యోగ అవకాశాలలో రిజర్వేషన్ సౌకర్యం కలదన్నారు.అనంతరం అర్చన విద్యాసంస్థల కరస్పాండెంట్ మదన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు 5 రోజులపాటు స్కౌట్ లో చేరడం వల్ల శారీరిక దారుఢ్యంతో పాటు మానసిక వికాసం అలబడుతుందన్నారు. శిక్షణకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో లీడర్ ఆఫ్ ది కోర్స్ లక్ష్మీకర్, హెచ్ డబ్ల్యు బి నిర్మల, స్కౌట్ మాస్టర్ లు చినబాబు, జాఫర్ సాదిక్ , ఈశ్వరయ్య, నితిన్ రెడ్డి , గైడ్ కెప్టెన్లు సుజాత, గోవిందమ్మ, ధనలక్ష్మి , సాయి కిరణ్ కుమారి, మంజు ప్రవీణ, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు350 మంది పాల్గొన్నారు.

## వనపర్తి పట్టణం రెండవ వార్డ్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బి కృష్ణన్న గెలిపించండి

### – మాజీ తాజా కౌన్సిలర్ రమాదేవి విజ్ఞప్తి.













**వనపర్తి** వనపర్తి పట్టణంలోని రెండో వార్డ్ లో వీధి వీధికి ప్రచారం చేస్తూ గత పది సంవత్సరాలుగా రెండో వార్డు కాలనీ అభివృద్ధి కోసం తమ కుటుంబం కృషి చేస్తుందని ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలుపరిచామని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు.అమలుపరుస్తున్నటువంటి సంక్షేమ కార్యక్రమాలలో స్థానిక రెండో వార్డు ప్రజలను భాగస్వాములు చేశామని వృద్ధులకు వితంతువులకు వికలాంగులకు పింఛన్లను మంజూరు చేయించామని ఇల్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇప్పించడం జరిగిందని ఇంకా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలకు తమ ముందువనపర్తి పట్టణంలోని రెండో వార్డ్ లో వీధి వీధికి ప్రచారం చేస్తూ గత పది సంవత్సరాలుగా రెండో వార్డు కాలనీ అభివృద్ధి కోసం తమ కుటుంబం కృషి చేస్తుందని ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలుపరిచామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలుపరుస్తున్నటువంటి సంక్షేమ కార్యక్రమాలలో స్థానిక రెండో వార్డు ప్రజలను భాగస్వాములు చేశామని వృద్ధులకు వితంతువులకు వికలాంగులకు పింఛన్లను మంజూరు చేయించామని ఇల్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇప్పించడం జరిగిందని ఇంకా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలకు తమ ముందు ఉంటామని తన భర్త బి కృష్ణ వార్డులోని ప్రతి ఒక్క ప్రజానీ కి అందుబాటులో ఉంటాడని ఎవరికి ఏ ఆపద వచ్చినా సహాయకారిగా ఉంటూ ప్రజలలో నాలుకై ఉన్నాడని ఉంటామని తన భర్త బి కృష్ణ వార్డులోని ప్రతి ఒక్క అందుబాటులో ఉంటాడని

ఎవరికి ఏ ఆపద వచ్చినా సహాయకారిగా ఉంటూ ప్రజలలోరమాదేవి వార్డులో ప్రజలకు తెలియజేస్తూ ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు ఈ ప్రచారంలో జే వినోద్ ,అరుణ,శీను భరత్, బాలు హరీష్, వెంకటేష్ మన్సూర్ కొండ స్వామి మహేష్ రాకేష్ కృష్ణ కుమార్పాల్గొన్నారు.చేతి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు.

## మర్రిపల్లి బస్టాండ్ వద్ద
# గుర్తు తెలియని వ్యక్తి మృతి



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి గ్రామ బస్టాండ్ వద్ద గుర్తు తెలియని ఓ మగ వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. సుమారు 50--55 ఏళ్ల వయస్సు గల ఈ వ్యక్తి గత మూడు రోజులుగా బస్టాండ్ పరిసరాల్లోనే ఉండి చెత్త కాగితాలు ఏరుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. మెడలో రుద్రాక్షతో పాటు ఇతర మాలలు ధరించి ఉండేవాడని, మతిస్థిమితం సరిగా లేకపోయినట్టు కనిపించేదని తెలిపారు.శనివారం ఉదయం సుమారు 11:30 గంటల సమయంలో బస్టాండ్ ముందు అకస్మాత్తుగా మూర్ఛపడి కుప్పకూలి, అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. సమాచారం అందుకున్న వేములవాడ రూరల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించి భద్రపరిచారు.మృతుడి వివరాలు తెలిసిన వారు లేదా గుర్తించే వారు వేములవాడ రూరల్ పోలీసులను ఫోన్ నంబర్: 8712656417 లో సంప్రదించాలని వేములవాడ రూరల్ పోలీసులు కోరారు.

# విద్యార్థులకు రూ.2.2 కోట్ల బహుమతులు



**మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతిభావంతులైన పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు రూ. 2.2 కోట్ల విలువైన నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్నట్లు శ్రీరామ్ మెదక్ బ్రాంచ్ మేనేజర్ రత్నాకర్ అన్నారు. శనివారం కౌడిపల్లి మండలంలోని కన్నారం, సలాబత్పూర్, వెలమ కన్నా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులతో నగదు ప్రోత్సాహకాల పోస్టర్ను ఆవిష్కరించారు. మేనేజర్ మాట్లాడుతూ పదవ తరగతిలో మండల స్థాయిలో అధిక మార్కులు సాధించిన వారికి రూ. 10వేలు, తాలూకా స్థాయిలో రూ. లక్ష, జిల్లాస్థాయిలో రూ. 2 లక్షలు, రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతికి రూ. 5 లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సిబ్బంది ప్రసాద్, కృష్ణ, భూపాల్ రెడ్డి, సల్మాన్, తదితరులున్నారు.

## మున్సిపల్ ఎన్నికల పోస్టల్ బ్యాలెట్
# ఓటింగ్‌ను జాగ్రత్తగా నిర్వహించాలి
**- కలెక్టర్ రాహుల్ రాజ్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను జాగ్రత్తగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులను ఆదేశించారు.తూప్రాన్ మున్సిపాలిటీకి సంబంధించి తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ను మున్సిపల్ కమిషనర్ తో కలిసి పరిశీలించారు.తూప్రాన్ మున్సిపాలిటీ కి సంబంధించి పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకునేందుకు వీలుగా తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను కలెక్టర్ రాహుల్ రాజ్ శనివారం పరిశీలించారు. ఓటర్ జాబితా నెంబర్,, ఓటర్ జాబితాలో సీరియల్ నెంబర్ను పరిశీలించారు, పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు డ్యూటీ ఆర్డర్ తో పాటు రాష్ట్ర ఎన్నికల సంఘం గుర్తింపు కార్డు తీసుకుని రావాలని సూచించారు..ఓటింగ్ సరళి వివరాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ పారదర్శకంగా, ప్రశాంతగా జరిగేలా చూడాలని, ప్రతీ అంశాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తూ పలు సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భారతదేశానికి ఐసీసీ
# అండర్-19 క్రికెట్ వరల్డ్ కప్ విజయం
**- మల్లాపూర్ వాసి ఆరోన్ జార్జ్ కి హృదయపూర్వక శుభాకాంక్షలు**



**ఉప్పల్ (ప్రశ్న న్యూస్)** భారతదేశానికి ప్రతిష్టాత్మకమైన ఐసీసీ అండర్--19 క్రికెట్ వరల్డ్ కప్ విజయంలో కీలక పాత్ర పోషించి దేశానికి గర్వకారణంగా నిలిచిన మల్లాపూర్ వాసి ఆరోన్ జార్జ్ కి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.ఆరోన్ జార్జ్ ఈ ఘన విజయం యువతకు ప్రేరణగా నిలుస్తుందని, భవిష్యత్తులో ఇంకా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. మల్లాపూర్ ప్రాంతానికి, ఉప్పల్ నియోజకవర్గానికి ఆయన తెచ్చిన కీర్తి అపూర్వమని ఎమ్మెల్యే ప్రశంసించారు.

# కాళేశ్వరం పైపుల దొంగలు గుర్తింపు
**- నిందితులు రిమాండ్ కు తరలింపు**



**గంభీరావుపేట (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, గంభీరావుపేట మండలంలోని ముస్తఫానగర్ నగర్ గ్రామ శివారులో కాళేశ్వరం ప్రాజెక్టు 9వ ప్యాకేజీకి చెందిన ఎంఆర్‌కేఆర్ కంపెనీ ఇనుప పైపులను గ్యాస్ కట్టర్‌తో కట్ చేసి అక్రమంగా విక్రయించిన ఘటన వెలుగులోకి వచ్చింది. సమాచారం అందుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితులను గుర్తించారు.పైపులను ముక్కలుగా చేసి మాచారెడ్డి గ్రామానికి చెందిన హమీద్‌కు విక్రయించినట్లు తేలడంతో బాబు, షేక్ ఇంతియాజ్, హమీద్, దేవయ్య,ఇతరులపై కేసులు నమోదు చేశారు. అనంతరం నిందితులను రిమాండ్‌కు తరలించారు.కేసు చేధనలో కీలక పాత్ర పోషించిన కానిస్టేబుళ్లు శ్రీనాథ్,బాల శ్రీనివాస్,నరేందర్‌లను సబ్ ఇన్స్పెక్టర్ పి. అనిల్ కుమార్ అభినందించారు.

## 12న జరిగే దేశవ్యాప్త సమ్మెను
# జయప్రదం చేయండి
**- సిఐటియు మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు.కడారి నాగరాజు**



**మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్)** ఫిబ్రవరి 12న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని శనివారం నర్సాపూర్ ఆటో యూనియన్ అడ్డా వద్ద సమ్మె బుక్లేట్స్ ఆవిష్కరణ చేసారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కదారి నాగరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా సమ్మె నిర్వహించడం జరుగుతుందన్నారు. బిజెపి తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని, వి బి జి రామ్ బిల్లును రద్దుచేసి నరేగా పథకాన్ని యధావిధిగా కొనసాగించాలనీ, విత్తన, విద్యుత్ చట్టాల సవరణ ఉపశమించుకోవాలని డిమాండ్ చేసారు. కార్మికులందరికి కనీస వేతనం 26,000 ఇవ్వాలని కోరారు. ఆటో కార్మికులకు భద్రత చట్టం తీసుకురావాలని, ట్రాన్స్పోర్ట్ రంగానికి కూడా వెల్ఫేర్ బోర్డు చేయాలనీ కోరారు. కనీసం పెన్షన్స్ సౌకర్యం నెలకు 9000 చేయాలని జూ×, గ్రాఖీ సౌకర్యం కల్పించాలని డ్రైవర్లు ప్రమాదంలో చనిపోతే ప్రభుత్వం 10 లక్షలు ఇవ్వాలని అనేక డిమాండ్ల తోటి ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సమ్మెలో పెద్ద ఎత్తున్న కార్మికులు, ప్రజలు, రైతులు, ఆటో డ్రైవర్లు ట్రాలీ డ్రైవర్ల అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఖదీర్, మల్లేశం, శ్యాంరావు, ఇమ్రాన్, ముస్తఫా, అంజగౌడ్, ఫెరోస్, బాబు, సత్యం, రాజు, అనిల్, భిక్షపతి, నర్సింలు, లచ్చయ్య, ఇనుస్, షిరాజ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 12న దేశ వ్యాప్త సమ్మెను
# జయప్రదం చేయండి



ధర్పల్లి(ప్రశ్న న్యూస్)తెలంగాణ ప్రగతి శిలా గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఆర్ రమేష్ పిలుపు ధర్పల్లి మండల కేంద్రం లో దేశ వ్యాప్త సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. టియుసిఐ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 12వ తేదీన దేశవ్యాప్తంగా సమ్మెలో సంఘటిత, అసంఘటిత రంగంలో పనిచేస్తున్న అందరూ పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యదర్శి ఆర్ రమేష్ పిలుపునిచ్చారు.వివిధ ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగులు ,కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, పరిశ్రమంలో పనిచేస్తున్న కార్మికులు కోట్లాదిమంది పాల్గొని కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేయనున్నారు. కనీస వేతనం 26 వేల రూపాయలు అమలు చేయాలని ప్రతి ఉద్యోగి వర్కర్ కి పిఎఫ్ ఈఎస్ఐ గ్రాడ్యుటి చట్టాలు అమలు చేయాలని ఉద్యోగ భద్రత కల్పించాలని కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ పోరాటంతో కేంద్ర ప్రభుత్వం మొండి తనాని విడినాడి ప్రజల కోసం కార్మికుల కోసం పనిచేయాలని లేనియెడల భవిష్యత్తులో తీవ్రమైన పోరాటాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఫిబ్రవరి 12వ తేదీ జరిగే సమ్మెలో బీడీ కార్మికులు,భవన నిర్మాణ కార్మికులు, పంచాయతీ వర్కర్స్ ,మిషన్ భగీరథ, ఆశ, అంగన్వాడీలు హమాలీలు విద్యుత్తు, హాస్పటల్, బ్యాంకు ,పోస్ట్ ఆఫీస్, రైల్వే వివిధ ఉద్యోగులు అందరు కూడా అధిక సంఖ్యలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం లో టి యు సి ఐ జిల్లా నాయకులు, ఆశన్న, మండల నాయకులు,సాయిలు, వీలాష్, సులోచన, సాయవ్వ,ఎ సాయవ్వ తదితరులు పాల్గొన్నారు.

## మిట్స్ (ఓఘూ) యూనివర్సిటీలో ఘనంగా
## 'సే నో టు డ్రగ్స్ - ఎస్ టు లైఫ్' 3కె రన్.

**మదనపల్లి,** యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, పిలుపునిచ్చారు. శనివారం మదనపల్లి సమీపంలోని మిట్స్ (ఓఘూ) డీమ్డ్ టు బీ యూనివర్సిటీ మరియు జిల్లా పోలీస్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన "సే నో టు డ్రగ్స్ ? ఎస్ టు లైఫ్" 3 కిలోమీటర్ల అవగాహన రన్‌ను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగం కేవలం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా, కుటుంబ గౌరవానికి, సమాజ భవిష్యత్తుకు తీరని నష్టం కలిగిస్తుంది. విద్యార్థులు గంజాయి వంటి చెడు వ్యసనాలకు లోనుకాకుండా, క్రీడలు, వ్యాయామం మరియు చదువుపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి. మీ చుట్టుపక్కల ఎవరైనా మాదకద్రవ్యాలకు బానిసలైనా లేదా వాటిని విక్రయిస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

సమాచారం అందించిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని ఆయన భరోసా ఇచ్చారు. యువతను సరైన మార్గంలో నడిపించేందుకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ మద్దతుగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మిట్స్ యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ సి. యువరాజ్, రిజిస్ట్రార్ డాక్టర్ ప్రదీప్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి. రామనాథన్, అడ్వైజర్ డాక్టర్ తులసిరామ్ నాయుడు, పోలీసు అధికారులు పోలీస్ సిబ్బంది, అధ్యాపకులు మరియు భారీ సంఖ్యలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# అభివృద్ధి అంటే శ్రీధర్ బాబు

**- శ్రీధర్ బాబు అంటేనే మంథని నియోజవర్గం అభివృద్ధి - 13 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఆశీర్వదించి గెలిపించండి**
**- మంథని పట్టణ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తా - పేద ప్రజలకు అండగా ఉంటా**
**- మంథని పట్టణమును అభివృద్ధి చేసి చూపిస్తా - ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**



**మంథని(ప్రశ్న న్యూస్)** మున్సిపల్ ఎన్నికల్లో 13 వార్డుల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ కౌన్సిలర్లను అభ్యర్థులను ఆశీర్వదించి గెలిపించాలని మంత్రి శ్రీధర్ బాబు ప్రజలను కోరారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంథని పట్టణంలో మంత్రి పలు వార్డు ల్లో తిరుగుతూ కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.మంథని పట్టణ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తానని మంత్రి ప్రజలకు హామీ ఇచ్చారు.పేద ప్రజలకు అండగా ఉంటానని మంథని మున్సిపల్ ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి చూపిస్తానాని చెప్పారు. ప్రజా పాలన అంటే ప్రజల్లో బాగా స్వాములు అయ్యి ప్రజలకు ఏ చిన్న సమస్య వచ్చిన ముందుండి ప్రజల సమస్యలను పరిష్కారం దిశగా పని చేస్తున్నాము. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో ప్రతి ఒక్క పేద వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే కార్యక్రమం చేస్తున్నాము. పేద వారి స్వంత ఇంటి కళను నెరవేరుస్తామని తెలిపారు. అదే విధంగా 200 యూనిట్ల కరెంట్ , మహిళలకు ఉచిత బస్సు, గ్యాస్ సబ్సిడీ పేదవారికి పథకాలను అందిస్తున్నాము.

అదే విధంగా ఆరు గ్యారెంటిల్లో భాగంగా ఇచ్చిన ప్రతి హామీని ఒక్కో ఒక్కటిగా నెరవేరుస్తూ వస్తున్నామని అన్నారు. అదే విధముగా మిగిలిన హామీలను రానున్న రోజుల్లో పథకాలను అందజేస్తామని అన్నారు.అభివృద్ధి విషయంలో నేను వెనుక అడుగు వేసే ప్రసేక్తే లేదని మంథని నియోజకవర్గం అభివృద్ధి అంటే శ్రీధర్ బాబు, శ్రీధర్ బాబు అంటేనే అభివృద్ధి అని తెలిపారు.రాష్ట్ర అభివృద్ధి తో పాటు మంథని అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తున్నామని 13 మంది కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే మంథని పట్టణమును రాష్టానికే రోల్ మోడల్ గా తీర్చి దిద్దుతానని హామీ ప్రజలకు ఆయన ఇచ్చారు.



# ఆయుర్వేద పరంపర చరిత్రలో సరికొత్త అధ్యాయం

**- బి.ఆర్.కె.ఆర్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో పరంపర వైద్యుల విజ్ఞాన ప్రతిభ**






**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలో ఆయుర్వేద వైద్య రంగానికి తలమానికంగా వెలుగొందుతున్న బి.ఆర్.కె.ఆర్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల వేదికగా ఆయుర్వేద పరంపర వైద్య విజ్ఞానం సరికొత్త చరిత్రను సృష్టించింది.

ఆయుర్వేద పరంపర మూలిక వైద్య మహా సంఘం (రి.నెం: 979/2025) మరియు ఆల్ హెర్బల్ ట్రెడిషనల్ ప్రాక్టీషనర్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం, పరంపర వైద్యుల జ్ఞానాన్ని విశ్వవిద్యాలయాల స్థాయికి తీసుకెళ్లడంలో ఒక విప్లవాత్మక అడుగుగా నిలిచింది.





### సమగ్ర వినతి పత్రం - అధికారిక గుర్తింపు

ఈ కార్యక్రమ ప్రధాన ఘట్టం ఏమిటంటే ఆయుర్వేద పరంపర మూలిక వైద్య మహా సంఘం తరపున వ్యవస్థాపక అధ్యక్షులు సింహాచలం లక్ష్మణస్వామి, ఆల్ హెర్బల్ ట్రెడిషనల్ ప్రాక్టీషనర్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు ఎండి. రఫీయుద్దీన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమాదేవి కి ఒక సమగ్ర వినతి పత్రాన్ని అందజేశారు. పరంపర వైద్యులకు, ఆయుర్వేద కళాశాలకు మధ్య పరస్పర సహకారం ఉండాలని, ఔషధ మొక్కల సంరక్షణ పరిశోధనలో కలిసి పనిచేయాలని ఈ పత్రంలో వివరించారు. ఈ వినతి పత్రాన్ని ప్రిన్సిపాల్ అత్యంత జాగ్రత్తగా, క్షుణ్ణంగా పరిశీలించి, దానికి అధికారికంగా అక్నాలెడ్జ్మెంట్ అందజేయడం విశేషం. పరంపర వైద్య సంఘాల విజ్ఞానాన్ని, వారి నిబద్ధతను ఒక ప్రభుత్వ ఉన్నత విద్యాసంస్థ గుర్తించడము అనేది పరంపర వైద్యులకు దక్కిన అతిపెద్ద గౌరవం చారిత్రక విజయం. ఇది భవిష్యత్తులో పరంపర వైద్యం విశ్వవ్యాప్తం కావడానికి గట్టి పునాదిగా నిలుస్తుందని నాయకులు సంతోషం వ్యక్తం చేశారు.

### అరుదైన వనమూలికల ప్రదర్శన - లైవ్ డెమోన్‌స్ట్రేషన్

కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమాదేవి, సింహాచలం లక్ష్మణస్వామి తీసుకువచ్చిన 1000కి పైగా అరుదైన వనమూలికల చిత్రాలతో కూడిన బృహత్ ఆల్బమ్‌ను చూసి ఆశ్చర్యపోయారు. పరంపర వైద్యుల వద్ద ఉన్న క్షేత్రస్థాయి జ్ఞానం సామాన్యమైనది కాదని వారు కొనియాడారు. అనంతరం బి.ఏ.ఎం.ఎస్ ఎం.డి వైద్య విద్యార్థులకు సుమారు 30 రకాల అరుదైన మొక్కలను ప్రత్యక్షంగా చూపిస్తూ వాటి ఔషధ గుణాలు, వైద్యంలో వాటి ఉపయోగాలను లక్ష్మణస్వామి, రఫీయుద్దీన్ వివరించారు. ఈ ప్రయోగాత్మక శిక్షణ విద్యార్థులకు నూతన ఉత్సాహాన్ని ఇచ్చింది.

### ప్రముఖుల ప్రసంగాలు - విజ్ఞాన సదస్సు

ఈ సదస్సులో కళాశాల డిపార్ట్మెంట్ ఫ్యాకల్టీ సభ్యులు డాక్టర్ స్వరూప, డాక్టర్ నరసింహ, డాక్టర్ విశ్వనాథ్, డాక్టర్ గాయత్రి పాల్గొని ప్రత్యేక ఉపన్యాసాలు ఇచ్చారు. వనమూలికల గుర్తింపులో పరంపర వైద్యులకున్న పట్టును వారు ప్రశంసించారు. పుస్తక జ్ఞానంతో పాటు ఇలాంటి క్షేత్రస్థాయి అనుభవాలు వైద్య విద్యార్థులకు ఎంతో అవసరమని వారు అభిప్రాయపడ్డారు. విద్యార్థులు అడిగిన అనేక క్లిష్టమైన ప్రశ్నలకు పరంపర వైద్యులు అత్యంత సరళంగా సమాధానాలు ఇచ్చి అందరినీ మంత్రముగ్ధులను చేశారు.

### హెర్బల్ గార్డెన్‌లో మొక్కల నాటడం

సదస్సు ముగిశాక, కళాశాల ఆవరణలోని హెర్బల్ గార్డెన్‌లో ప్రిన్సిపాల్, ఫ్యాకల్టీ సభ్యులు విద్యార్థులతో కలిసి పరంపర వైద్యులు తెచ్చిన అరుదైన మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణతో పాటు, అంతరించిపోతున్న అపురూపమైన ఔషధ మొక్కలను భావి తరాలకు అందించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఆవరణ అంతా పండగ వాతావరణం నెలకొంది.

### సర్టిఫికేట్ల ప్రాధాన్యత - విద్యార్థులకు లబ్ధి

సదస్సులో పాల్గొన్న ప్రతి విద్యార్థికి ఆయుర్వేద పరంపర మూలిక వైద్య మహా సంఘం, ఆల్ హెర్బల్ ట్రెడిషనల్ ప్రాక్టీషనర్ ఆర్గనైజేషన్ తరపున పార్టిసిపేషన్ సర్టిఫికేట్లు అందజేశారు. ఈ సర్టిఫికేట్ల వల్ల విద్యార్థులకు వారి విద్యాభ్యాసంలో అదనపు మార్కులు (క్రెడిట్ స్ ) రావడమే కాకుండా, వారి వృత్తిపరమైన గుర్తింపునకు కూడా తోడ్పడటం విశేషం. ఒక పరంపర వైద్య సంస్థ ఇచ్చే ధ్రువీకరణ పత్రం ప్రభుత్వ వైద్య విద్యార్థులకు మార్కుల పరంగా ఉపయోగపడటం అనేది పరంపర వైద్య చరిత్రలో ఒక మైలురాయి.

ఈ కార్యక్రమం ఒక వ్యక్తిగత విజయం కాదని, ఇది యావత్ పరంపర వైద్య లోకానికి దక్కిన గౌరవమని సింహాచలం లక్ష్మణస్వామి ఉద్వేగంగా పేర్కొన్నారు. సహకరించిన డాక్టర్ రమాదేవి కి, ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేస్తూ, రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా ప్రతి వైద్య కళాశాలలో పరంపర వైద్యుల విజ్ఞానం వికసించేలా కృషి చేస్తామని ప్రకటించారు.

## దోమల నివారణకై చర్యలు తీసుకోవాలని వినూత్న నిరసన తెలిపిన ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ



**ఉప్పల్ ( ప్రశ్న న్యూస్)**దోమల నివారణ చర్యలు చేపట్టాలని ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజావాణి సత్యం సంస్థ అధ్యక్షులు ఎర్రం శ్రీనివాస్ ఆధ్వర్యంలో వినూత్న పద్ధతిలో నిరసన ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎర్రం శ్రీనివాస్ మాట్లాడు తూ జిహెచ్ఎంసి ఉప్పల్ సర్కిల్ నందు దోమల బెడద ఎక్కువగా ఉన్నప్పటికీ అధికారులు మరియు పాలకులు పట్టించుకోకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ప్రజలు ఇంట్లో ఉన్న బయటకు వెళ్లాలన్న దోమల బెడదతో చాలా ఇక్కట్లు పడుతున్నారని, అధికారులకు పాలకులకు తెలియజేసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందని కోటల్లో జిహెచ్ఎంసి బడ్జెట్ కేటాయించినప్పటికీ కింది స్థాయికి వచ్చేసరికి ఎలాంటి నివారణ చర్య లు తీసుకోకపోవడంతో దోమలతో ఇబ్బందులు పడుతున్నారని సమస్యలను పరిష్కరించాలంటూ నిరసన కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణ హోటల్ నుండి రామంతపూర్ ప్రధాన రహదారి రాజీవ్ గాంధీ విగ్రహం వరకు ర్యాలీగా వచ్చి నిరసన తెలిపారు. అధికారులు పాలకులు ఇప్పటికైనా మేలుకొని రోడ్లపై చెత్త వేయకుండా చెత్త కేంద్రాలను వెంటనే ఎత్తివేయాలని చెరువులోకి మురుగు నీరుని పంపకుండా చూడాలని రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఒకవేళ మీరు చర్యలు తీసుకోకపోతే ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున చర్యలు చేపడతామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి గోసుల విజయ్ కుమార్, రవీందర్రావు, ముక్కాల సురేష్ గుప్తా, సిద్ధ గొని రాజు, జిల్లా కిరణ్ కుమార్ లావణ్య, డాన్ బిక్షపతి కొంగర శ్రీనివాస్ సుధాకర్ కృష్ణ చారి, మల్లేష్ పాల్గొన్నారు.

## గ్రామ దేవాలయ అభివృద్ధిలో

# నీలోజిపల్లి ముందంజ

**- సర్పంచ్ భాస్కర్ ప్రత్యేక చొరవతో గర్భగుడికి స్టీల్ ద్వారాలు ఏర్పాటు**



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, నీలోజిపల్లి గ్రామంలోని శ్రీ కోదండ రామాలయం గర్భగుడికి గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్ ప్రత్యేక చొరవతో స్టీల్ ద్వారాలను ఏర్పాటు చేశారు. ఆలయ భద్రతతో పాటు ఆధ్యాత్మిక వాతావరణాన్ని పరిరక్షించే ఉద్దేశంతో ఈ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ అనుముల భాస్కర్ మాట్లాడుతూ, "గ్రామ ప్రజల ఆధ్యాత్మిక అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఆలయ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నాం. భక్తులు సౌకర్యంగా, భద్రంగా దర్శనం చేసుకునేలా గర్భగుడికి స్టీల్ ద్వారాలను ఏర్పాటు చేశాం. ముందుముందు కూడా ఆలయ అభివృద్ధికి అవసరమైన పనులు కొనసాగిస్తాం" అని పేర్కొన్నారు. గ్రామంలో ఆలయ అభివృద్ధికి చేపడుతున్న చర్యలపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ, సర్పంచ్‌ను అభినందించారు.

## కేసీఆర్‌పై విమర్శలకు కాంగ్రెస్‌కు నైతిక హక్కు లేదు

**- బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు : అనుముల భాస్కర్**



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** తెలంగాణ అభివృద్ధి అంటే కేసీఆర్ దూరదృష్టి, పట్టుదల గుర్తుకువస్తాయని బీఆర్ఎస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా నాయకులు అనుముల భాస్కర్ అన్నారు. తెలంగాణ కోసం నిజంగా కృషి చేసిన నాయకుడు కేసీఆర్ మాత్రమేనని ఆయన వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కుంగిన ఒక్క పిల్లర్‌ను కూడా మరమ్మతు చేయలేని స్థితిలో ఉన్న కాంగ్రెస్ నాయకులు కేసీఆర్‌పై విమర్శలు చేయడం ఆశ్చర్యకరమని అన్నారు. ముందుగా అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలని, తర్వాత మాట్లాడాలని కాంగ్రెస్‌కు హితవుపలికారు.

## మహాశివరాత్రి జాతరకు అధికారిక ఆహ్వాన పత్రికలు అందజేసిన ఆలయ ఈఓ



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించనున్న మహాశివరాత్రి జాతర సందర్భంగా ఆలయ అధికారులు ఏర్పాట్లను వేగవంతం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జాతరకు సంబంధించి ప్రముఖ అధికారులకు అధికారిక ఆహ్వానాలు అందజేశారు. హైదరాబాద్‌లోని వారి కార్యాలయాల్లో ప్రిన్సిపల్ సెక్రటరీ (దేవాదాయ ధర్మాదాయ శాఖ) శైలజా రామయ్యర్, ముఖ్యమంత్రి ఓఎస్‌డీ శ్రీనివాసులు వేముల, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి కె.ఎస్. శ్రీనివాస రాజు, రెవెన్యూ శాఖ అదనపు కార్యదర్శి ఎల్.ఎల్.వి. సుబ్బమ్మ, దేవాదాయ ధర్మాదాయ శాఖ అదనపు కమిషనర్ యం.యం.డి. కృష్ణవేణిలను కలిసి ఆలయ ఈఓ ఎల్. రమాదేవి స్వయంగా ఆహ్వాన పత్రికలు అందజేశారు. అనంతరం ఆలయ అర్చకులు, వేద పండితులు స్వామివారి శేషవస్త్రం కప్పి లడ్డు ప్రసాదాన్ని సమర్పించారు. జాతర నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులు వివరాలు తెలుసుకొని, భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈ మహిపాల్ రెడ్డి, ఏఈఓ శ్రావణ్ కుమార్, ఆలయ అర్చకులు, వేద పండితులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కొదురుపాక బస్టాండ్ నిర్మాణానికి

# అడుగులు వేగం

**- స్థలాన్ని పరిశీలించిన ఆర్టీసీ ఆర్ఎం : రాజు**



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని కొదురుపాక గ్రామంలో బస్టాండ్ నిర్మాణానికి సంబంధించి కీలక ముందడుగు పడింది. గ్రామ ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న బస్టాండ్, బస్‌స్టాప్ సమస్య పరిష్కారానికి ఆర్టీసీ ఆర్ఎం రాజు శనివారం గ్రామాన్ని సందర్శించి స్థల పరిశీలన చేపట్టారు. గ్రామ సర్పంచ్ డా. కత్తెరపాక మంజుల – సుధాకర్ ఆధ్వర్యంలో గ్రామ పాలకవర్గం సభ్యులు, విలేజ్ డెవలప్మెంట్ కమిటీ ప్రతినిధులతో కలిసి ప్రతిపాదిత స్థలాలను పరిశీలించి బస్టాండ్ నిర్మాణానికి అనుకూలతపై చర్చించారు. ఇటీవల రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి బస్టాండ్ అవసరంపై వినతిపత్రం సమర్పించగా, మంత్రి సానుకూలంగా స్పందించి ఆర్టీసీ ఆర్ఎంకు రిఫర్ లేఖ ఇచ్చిన విషయం తెలిసిందే. మంత్రి సూచనలతో స్పందించిన ఆర్ఎం రాజు గ్రామాన్ని స్వయంగా సందర్శించడం గ్రామస్తుల్లో ఆశలు పెంచింది. బస్టాండ్ నిర్మాణంపై త్వరలోనే స్పష్టమైన నిర్ణయం వెలువడే అవకాశం ఉందని, కొదురుపాకతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని సర్పంచ్ డా. కత్తెరపాక మంజుల – సుధాకర్ తెలిపారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఉపసర్పంచ్ గోపాల్, వార్డు సభ్యులు సిద్ధాంతి దీక్షిత్, బాలగోని శ్రీనివాస్, సుద్దాల వేణు, అన్నదాత లక్ష్మినారాయణ, విలేజ్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు బండి శ్రీనివాస్, కత్తెరపాక సుధాకర్, మైలారం శ్రీనివాస్, బాలగోని వెంకటేష్, బాలగోని అనిల్, రంగారావు, పందుల వెంకటేష్, కత్తెరపాక మణి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రామంతాపూర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా

# ధూపాటి సురేష్ ఎన్నిక

**ఉప్పల్ (ప్రశ్న న్యూస్)**

రామంతాపూర్(రామంతాపూర్, వెంకట్ రెడ్డి నగర్, హబ్సిగూడ) ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. క్లబ్ అధ్యక్షుడిగా ధూపాటి సురేష్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎ.విజయేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎం. అశోక్, ప్రధాన కార్యదర్శిగా ఎం.డి.జక్రియా, కార్యదర్శిగా పి.నర్సిములు, కోశాధికారిగా యాదగిరి గౌడ్, కార్యవర్గ సభ్యులుగా ముత్యం రెడ్డి, రాజు, షేక్ పాషా లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ జర్నలిజం విలువలకు కట్టుబడి నీతి, నిజాయితీ తో క్లబ్ పనిచేస్తుందని, సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుందని ఈ సందర్భంగా తెలిపారు.



## జ్యోతిరావు పూలే విగ్రహాన్ని

# తొలగించే యత్నం.?

**- విగ్రహంపై రాళ్లతో దాడి, నిరసన వ్యక్తం చేసిన జ్యోతిరావు పూలే అభిమాన సంఘం**



**పటాన్‌చెరు(ప్రశ్న న్యూస్)** తెల్లాపూర్ మున్సిపాలిటీ ప్రధాన కూడాలి వద్ద జ్యోతిరావు పూలే అభిమాన సంఘం ఏర్పాటు చేసిన జ్యోతిరావు పూలే విగ్రహాన్ని కొందరు వ్యక్తులు తోసివేసి రాళ్లతో దాడి చేశారని రామచంద్రపురం జాతీయ రహదారి ఆనుకుని ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. అంటరానితరం, కుల వ్యవస్థ నిర్మూలన మహిలోద్ధరణకు పాటుపడిన మహనీయుని విగ్రహాన్ని తొలగించే ప్రయత్నం చేయడం రాళ్లతో దాడి చేయడం ఎంతవరకు సమంజసమని సంజీవ ఆవేదన వ్యక్తం చేశారు. విగ్రహ ఏర్పాటు విషయంలో తగ్గబోమని జ్యోతిరావు పూలే మహనీయుని విగ్రహాన్ని సరిదిద్ది విగ్రహార పాటలు చేస్తామని మహనీయుని విగ్రహ ఏర్పాటులో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సమాజంలో తనకు ఎవరు వ్యక్తిగతమైన శత్రువులు లేరని సామాజిక తత్వవేత్త ఆయన జ్యోతిరావు పూలే విగ్రహ ఏర్పాటు వివాదం చేయవద్దని మీడియా ముఖంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, ముక్కా నరసింహారావు, ఏడుకొండలు, బి నరసింగరావు, సంజీవ్ కుమార్, మహిపాల్ గౌడ్ జ్యోతిరావు పూలే అభిమానులు పాల్గొన్నారు.

## ఐబీఎం క్వాంటం ఇన్నోవేషన్

# సెంటర్ ప్రారంభించిన సీఎం

**అమరావతి** ఐబీఎం క్వాంటం ఇన్నోవేషన్ సెంటర్ ను ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ తదితరులు శనివారం ప్రారంభించారు. అమరావతిలో ఏర్పాటు కానున్న క్వాంటం వ్యాలీ క్వాంటం నెర్వ్ సెంటర్ గా మారుతుంది. ? ఇక్కడ ఏర్పాటు కానున్న క్వాంటం వ్యాలీ నుంచి క్వాంటం హార్డ్ వేర్ యాక్సెస్ ఉంటుంది పరిశోధనలు, ఆవిష్కరణల కోసం కొత్త అల్గారిథమ్స్, క్రిప్టో గ్రఫీ అవసరం అవుతుందిదానికి అనుగుణంగా నిపుణులు అవసరం అవుతారు. అందుకే అమరావతిలో క్వాంటం ఇన్నోవేషన్ సెంటర్ ను ఏర్పాటు చేస్తున్నాం. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 35 క్యూఐసీలతో పాటు భారత్ లో మొదటి క్యూఐసీ అమరావతిలో అందుబాటులోకి వస్తోందని ఐబీఎం ప్రతినిధులు వెల్లడించారు.

## జీవితాన్ని చూపిస్తుంది!



సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్ ప్రధాన పాత్రలో రూపొందిస్తున్న తాజా చిత్రం 'పిఠాపురంలో'. 'అలా మొదలైంది' ఉపశీర్షిక. మహేష్‌చంద్ర దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మహేష్ చంద్ర సినిమా టీమ్ సంస్థ నిర్మిస్తున్నది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాల్ని జరుపుకుంటున్న ఈ సినిమా విడుదల తేదీని త్వరలో ప్రకటించనున్నారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'ముగ్గురు అమ్మాయిల కథలా అనిపించే ముగ్గురు తండ్రుల వ్యథ ఇది. నేటి ఇంటర్‌నెట్ తరం తెలుసుకోవాల్సిన అసలైన కథ. మన చుట్టూ ఉన్న సమాజాన్ని, జీవితాల్ని చూస్తున్నట్లే ఉంటుంది. సెంటిమెంట్‌తో పాటు చక్కని వినోదంతో ఆకట్టుకుంటుంది' అన్నారు. పృథ్వీరాజ్, కేదార్‌శంకర్, మణిచందన, జయవాహిని, అన్నపూర్ణమ్మ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కథ: ఆకుల సురేష్ పటేల్, సంగీతం: జీసీ క్రిష్, నిర్మాతలు: దుండిగల్ల బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్‌ఎమ్ మురళీ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: మహేష్‌చంద్ర.

## 'యుఫోరియా'కు పాజిటివ్ రెస్పాన్స్

'ఈ సినిమా ద్వారా దర్శకుడిగా నన్ను నేను కొత్తగా ఆవిష్కరించుకోవాలని ప్రయత్నించాను. అందుకు తగిన ఫలితం లభిస్తున్నది. పేరెంటింగ్, సోషల్ ఇంపాక్ట్ అనే అంశాలను రియలిస్టిక్‌గా చూపించారని ప్రశంసలొస్తున్నాయి' అని అన్నారు ప్రముఖ దర్శకుడు గుణశేఖర్. ఆయన నిర్ధేశకత్వంలో రూపొందిన 'యుఫోరియా' శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. రాగిణి గుణ సమర్పణలో నీలిమ గుణ, యుక్తా గుణ ఈ చిత్రాన్ని నిర్మించారు. భూమిక, సారా అర్జున్, నాజర్, రోహిత్, విఘ్నేష్ గవిరెడ్డి కీలక పాత్రధారులు. శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన సక్సెస్‌మీట్‌లో గుణశేఖర్ మాట్లాడుతూ పైవిధంగా స్పందించారు. ఎలాంటి ఫార్ములాని ఫాలో కాకుండా హార్ ?డహిట్టింగ్‌గా ఈ కథను చెప్పాలనుకున్నామని, ఇటీవల కాలంలో ఇలాంటి క్లైమాక్స్ చూడలేదని అంటున్నారని, అన్ని కేంద్రాల్లో పాజిటివ్ రెస్పాన్స్ లభిస్తున్నదని గుణశేఖర్ తెలిపారు. తల్లీ కొడుకు మధ్య సంఘర్షణను హృదయానికి హత్తుకునేలా చూపించారని ప్రశంసలొస్తున్నాయని, భూమిక నటన హైలైట్‌గా నిలుస్తున్నదని నీలిమ గుణ చెప్పారు.



## నవ్వకండి!

### - ఇది చాలా సీరియస్ మ్యాటర్!



త రు ణ్ బ న్ స్ క ర్ కథానాయకుడిగా కాశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాకు 'గాయపడ్డ సింహం' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. 'నవ్వకండి! ఇది చాలా సీరియస్ మ్యాటర్!' అనేది ఉపశీర్షిక. ఫరియా అబ్దుల్లా, మానస చౌదరి కథానాయికలు. పవన్ సాదినేని సమర్పణలో కల్యాణ్ చక్రవర్తి మంథిన, భాను కిరణ్ ప్రతాప, విజయ్‌కృష్ణ లింగమనేని, ఉమేష్ బన్సల్ సప్తస్వ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఒక పాట మినహా చిత్రీకరణ పూర్తయింది.

దాంతో మేకర్స్ ప్రమోషన్స్ మొదలుపెట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం హీరో ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు. క్రైమ్, హాస్యం, పొలిటికల్ సెటైర్ కలగలిసిన ఎంటర్‌టైనర్ ఇదని, కథ, హీరో పాత్రను ప్రతిబింబించేలా ఈ పోస్టర్ డిజైన్ చేశామని, ఈ నెల 9న ఈ సినిమా టీజర్‌ని విడుదల చేయనున్నామని మేకర్స్ తెలిపారు. విష్ణు ఓయి, హర్షవర్ధన్, శుభలేఖ సుధాకర్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కథ: సూర్యప్రకాష్ జోస్యుల, కెమెరా: విద్యాసాగర్ చింత, సంగీతం: స్వీకర్ అగస్తీ, నిర్మాణం: సప్తస్వ మీడియా వర్క్స్,గ్రూవ్ స్టోరీస్, జీ



## నాగబంధం స్వాధీనం కోసం

విరాట్‌కర్ణ హీరోగా నటిస్తున్న మైథలాజికల్ యాక్షన్ డ్రామా 'నాగబంధం'. అభిషేక్ నామా దర్శకుడు. మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 15న సినిమా టీజర్‌ను విడుదల చేయబోతున్నారు. ఈ నేపథ్యంలో ఈ చిత్రంలో ప్రధాన పాత్రల్ని పరిచయం చేస్తున్నారు. శుక్రవారం ఆఫ్ఘన్ సుల్తాన్ అబ్దాలి పాత్రను పోషించిన బాలీవుడ్ నటుడు రిషబ్ సాహ్నీ ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. బాలీవుడ్ 'ఫైటర్' సినిమాతో రిషబ్ సాహ్నీ పాపులర్ అయ్యాడు.

1750 బ్యాక్‌డ్రాప్‌లో నడిచే ఈ కథలో భారత్‌లో సుల్తాన్ అబ్దాలి చేసిన దండయాత్రలు, దేవాలయాల దోపిడి, అపార సంపద కోసం అతను చేసిన నేరాల్ని చూపించబోతున్నారు. హిమాలయాల్లో దాగివున్న మార్మిక శక్తులు కలిగిన నాగబంధాన్ని స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించే వ్యక్తిగా సుల్తాన్ అబ్దాలి పాత్ర సాగుతుందని మేకర్స్ తెలిపారు. నభా నటేష్, ఐశ్వర్య మీనన్, జగపతిబాబు, జయప్రకాష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సౌందర్ రాజన్, సంగీతం: అభే, జునైద్ కుమార్, నిర్మాతలు: కిషోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: అభిషేక్ నామా.



## షాహిద్‌తో మరో సినిమా

అగ్ర కథానాయిక రష్మిక మందన్న ప్రస్తుతం సూపర్‌ఫామ్‌లో ఉంది. ముఖ్యంగా హిందీలో గత ఏడాది ఛావా, థామా వంటి భారీ హిట్స్‌తో రేసులో దూసుకుపోయింది. ప్రస్తుతం ఈ భామ హిందీలో షాహిద్‌కపూర్‌తో కలిసి 'కాక్‌టెయిల్-2' చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. తాజా సమాచారం ఈ జోడీ మరో భారీ సినిమాలో భాగం కాబోతున్నట్లు తెలిసింది. 'బధాయి హో' 'మైదాన్' వంటి చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు అమిత్ రవీంద్రనాథ్ శర్మ ఈ చిత్రానికి దర్శకత్వం వహించబోతున్నారు. రొమాంటిక్ కామెడీ జోనర్‌లో ఈ చిత్రం తెరకెక్కనున్నట్లు తెలిసింది. సెప్టెంబర్‌లో ఈ సినిమా సెట్స్‌మీదకు వెళ్లనున్నట్లు సమాచారం. ప్రస్తుతం రష్మిక మందన్న తెలుగులో లేడీ ఓరియెంటెడ్ యాక్షన్ థ్రిల్లర్ 'మైసా'లో నటిస్తున్నది. ఇదిలావుండగా విజయ్ దేవరకొండ-రష్మిక మందన్న ఈ నెలలోనే వివాహబంధంతో ఒక్కటి కాబోతున్నట్లు వార్తలొస్తున్నాయి. 26న రాజస్థాన్ ఉదయ్‌పూర్‌లో ఈ జంట పెళ్లిపీటలెక్కబోతున్నట్లు సమాచారం.



## గోవా గ్యాంగ్‌స్టర్ డ్రామా 'టాక్సిక్'..

### తెలుగులో విడుదల చేస్తున్న దిల్‌రాజు

'కేజీఎఫ్' ఫ్రాంచైజీ చిత్రాలతో దేశవ్యాప్తంగా తిరుగులేని పాపులారిటీ సంపాదించుకున్నారు కన్నడ అగ్ర నటుడు యశ్. దాదాపు నాలుగేళ్ల విరామం తర్వాత ఆయన 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకురాబోతున్నారు. ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామా పాన్ ఇండియా స్థాయిలో మార్చి 19న ప్రేక్షకుల ముందుకురానుంది. తాజాగా ఈ సినిమా తెలుగు హక్కులను అగ్ర నిర్మాత దిల్ రాజు 120కోట్ల భారీ మొత్తానికి సొంతం చేసుకున్నారు.ఇటీవలకాలంలో ఇదే బిగ్గెస్ట్ డీల్ అంటున్నారు. 1980 గోవా నేపథ్యంలో గ్యాంగ్‌వార్ డ్రామా ఇదని, యశ్ పాత్ర సరికొత్త పంథాలో ఉంటుందని చెబుతున్నారు. యశ్ నుంచి నాలుగేళ్ల తర్వాత వస్తున్న ఈ సినిమాపై అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయని, ఇలాంటి ప్రెస్టేజియస్ మూవీని తమ సంస్థ ద్వారా తీసుకురావడం ఆనందంగా ఉందని దిల్ రాజు పేర్కొన్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ పతాకాలపై వెంకట్ కె నారాయణ, యశ్ ఈ చిత్రాన్ని నిర్మించారు.

## శ్రీశైలం మల్లన్న హుండీ ఆదాయం

# 3 కోట్ల 76 లక్షల 22 వేల 452 నగదు

- 25 రోజుల మల్లన్న హుండీ 3 కోట్ల 76 లక్షల 22 వేల 452 నగదు
- గోల్డ్ అప్రైజర్ హాజరుకాని కారణంగా హుండీ లెక్కింపులో బంగారం వెండి లెక్కించని దేవస్థానం అధికారులు
- హుండీలో లెక్కింపులో పాల్గొన్న దేవస్థానం చైర్మన్ రమేష్ నాయుడు,అధికారులు పర్యవేక్షకులు

**శ్రీశైలం** నంద్యాల జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలం శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి అమ్మవార్ల ఉభయ ఆలయాలు,హుండీ లెక్కింపు నిర్వహించారు చంద్రవతి కళ్యాణ మండపంలో పకడ్బందీగా ఈ లెక్కింపు నిర్వహించగా శ్రీశైలం మల్లన్న దేవస్థానానికి 3 కోట్ల 76 లక్షల 22 వేల 452 రూపాయల నగదు రాబడిగా లభించిందని దేవస్థానం చైర్మన్ రమేష్ నాయుడు తెలిపారు,ఈ ఆదాయాన్ని గత 25 రోజులులో శ్రీ స్వామి అమ్మవార్లకు భక్తులు నగదును కానుకల రూపంలో సమర్పించినట్లు చైర్మన్ రమేష్ నాయుడు వెల్లడించారు ఈహుండి లెక్కింపులో గోల్డ్ అప్రైజర్ హాజరుకాని కారణంగా బంగారం వెండి లెక్కించని దేవస్థానం అధికారులు, 526 యుఎస్ఏ డాలర్లు,1435 యు.ఎ.ఇ దిర్హామ్స్,ఇంగ్లాండు ఫౌండ్స్ 55, సింగపూర్ డాలర్లు 84, కెనడా డాలర్లు 140, ఒమన్ బైసా 800, మలేషియా రింగిట్స్ 28, ఆస్ట్రేలియా డాలర్లు 10, సౌదీ రియాల్స్10, మొదలైన విదేశీ కరెన్సీ కూడా ఈ హుండీల లెక్కింపులో లభించాయి.పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సీసీ కెమెరాల నిఘాతో ఈ లెక్కింపును చేపట్టడం జరిగింది హుండీల లెక్కింపులో దేవస్థానం చైర్మన్ రమేష్ నాయుడు పలు విభాగాల యూనిట్ అధికారులు,పర్యవేక్షకులు, సిబ్బంది,శివసేవకులు తదితరులు పాల్గొన్నారు....

# పంచాయతీ ఎన్నికలకు సిద్ధం

**అమరావతి** రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. అందుకు సంబంధించిన కీలక ఆదేశాలను ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. మార్చి 9వ తేదీ నాటికి అన్ని గ్రామ పంచాయతీల ఓటర్ల జాబితాను సిద్ధం చేయాల్సిందిగా ఆదేశాలను జారీ చేసింది. ఏప్రిల్ లో సర్పంచుల పదవీకాలం ముగుస్తుండడంతో, వెంటనే ఎన్నికల ప్రక్రియ జరిపేందుకు కసరత్తు ప్రారంభించినట్లు తాజా సమాచారం.

# ఫిజియోథెరపీ డాక్టర్ ఆత్మహత్య



**కుత్బుల్లాపూర్** సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఫిజియోథెరపీ డాక్టర్ ఆత్మహత్య చేసుకుంది. సాయిబాబా నగర్ లో నివాసముండే బత్తిని అనిత 29,(ఇంకా వివాహం కాలేదు) ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్ కు ఉరి వేసుకుని సూసైడ్ చేసుకుంది. మృతురాలు ఎల్బీ నగర్ షైన్ ఆసుపత్రిలో ఫిజియోథెరఫిస్ట్ గా పని చేస్తుంది. ప్రేమ వ్యవహారమే ఆత్మహత్య కు కారణమని తెలుస్తుంది. సురారం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఘటన సమయంలో చికిత్స పొందుతున్న తల్లి దగ్గర హాస్పటల్ లో తండ్రి రాజమల్లు వున్నాడు. ..

# ఇస్మాయిల్ బేకరీలో పాడైపోయిన ఫుడ్డు

**ఒంగోలు** ఒంగోలు ఇస్మాయిల్ బేకరీ లో ఫుడ్ కంట్రోల్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. నగరంలో ఫుడ్ కంట్రోల్ పరిధిలో పది టీం లతో అధికారులు హోటల్, రెస్టారెంట్లు బేకరీస్ లో తనిఖీలు జరిగాయి. ఇస్మాయిల్ ఫుడ్ బేకరిలో కాలం తీరిన బేకరీ ఐటమ్ లను అధికారులు సీజ్ చేసారు. హోటల్లో రెస్టారెంట్లు బేకరీలో ఎక్స్పైర్ అయిన ఫుడ్ ను సప్లై చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ అధికారులు హెచ్చరించారు. నగరంలో పలు దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు.

# బీఆర్ఎస్ నేతలపై దాడి

### - సీపీ కి ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే మల్లారెడ్డి

**హైదరాబాద్** బిఆర్ఎస్ పార్టీ నేతలపై కాంగ్రెస్ నేతల దాడికి నిరసనగా సైబరాబాద్ సీపీకి బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేసారు. శుక్రవారం నాడు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ శ్రేణులపై జరిపిన దాడిని నిరసిస్తూ గచ్చిబౌలి సైబరాబాద్ కమిషనరేట్ కార్యాలయంకు బిఆర్ఎస్ ముఖ్య నేతలు వచ్చారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తూ, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సైబరాబాద్ పోలీస్ కమిషనర్ను ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు,మాజీ మంత్రి మల్లారెడ్డి ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ కలిసారు...

# అబూజ్మాడ్‌లో కొనసాగుతున్న ఆపరేషన్



**గడ్చిరోలి** గడ్చిరోలి జిల్లాలో పోలీసులతో ఎదురుకాల్పుల్లో సిపిఐ (మావోయిస్టు) కీలక నేత ప్రభాకర్ సహా 7 మంది మావోయిస్టులు హతం అయ్యారు.గడ్చిరోలి డివిజన్ కమిటీ ఇన్చార్జ్, వెస్ట్




సబ్ జోనల్ బ్యూరో ఇన్చార్జ్, కోయ్ నెం.10 ఇన్చార్జ్ ప్రభాకర్ (కామారెడ్డి, తెలంగాణ) మృతి చెందాడు. ప్రభాకర్పై .25 లక్షల రివార్డు ఉంది.?

మూడు రోజుల ఆపరేషన్లో మొత్తం 7 మావోయిస్టుల మృతదేహాలు స్వాధీనం చేసుకున్నారు.మొత్తం నలుగురు పురుషులు, ముగ్గురు మహిళలు మృతి చెందారు. ఘటనాస్థలిలో 3 ఏకే -47లు, 1 ఎస్ఎల్ఆర్, 1 .303 రైఫిల్ స్వాధీనం చేసుకున్నారు. ఎదురుకాల్పుల్లో ఓ సి60 జవాన్ దీపక్ చిన్న మడవి (38) మృతి చెందాడు. దీపక్ చిన్న మడవికి ఆదివారం స్వగ్రామంలో పూర్తి గౌరవాలతో అంత్యక్రియలు జరగనున్నాయి. మరో జవాన్ జోగా మడవి గాయాల నుంచి కోలుకుంటున్నారు.

# ప్రభుత్వ స్థలాలపై మట్టి మాఫియా దోపిడి

- అధికారుల కనుసైగల్లోనే యదేచ్ఛగా తవ్వకాలు
- ప్రజల ఆస్తి దోచుకుంటున్న అక్రమార్కులు
- మౌనంగా రెవెన్యూ, పోలీస్ శాఖలు





మహేశ్వరం (ప్రశ్న న్యూస్) ప్రభుత్వ భూములు మట్టి మాఫియాకు కాసుల పంటగా మారుతున్నాయి. మహేశ్వరం మండల పరిధిలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలంలో, టీజీఐఐసీ(ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్, ఈఎంసి) కు చెందిన ప్రభుత్వ స్థలాల్లో మాఫియా గుండాలు నిర్భయంగా మట్టి తవ్వకాలు సాగుతున్నాయన్న ఆరోపణలు స్థానికంగా తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి.రాత్రింబవళ్ళు తేడా లేకుండా భారీ యంత్రాలతో మట్టి తరలింపు జరుగుతున్నా రెవిన్యూ, టీజీఐఐసీ శాఖల అధికారులు లంచాలు తీసుకుని మౌనం వహిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ప్రభుత్వ అధికార యంత్రాంగమంతా కళ్లుమూసుకున్నట్టుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్ఐ, ఎమ్మార్వో, ఆర్డీఓల కనుసైగల్లోనే అక్రమ తవ్వకాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు తీవ్రమవుతున్నాయి.

### డబుల్ బెడ్ రూమ్ పక్కనే దోపిడీ

పేదలకు కేటాయించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలాల్లో మట్టి తవ్వకాలు జరగడం పలు అనుమానాలకు తావిస్తోంది. భూమి తొలగింపుతో ఇళ్లకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని రాత్రి సమయంలో వందల సంఖ్యలో మట్టి లారీలు అతివేగంతో తిరుగుతున్నాయని స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇంత జరుగుతున్న పోలీసుల నిఘా లేదా.? లేక మౌనమా.? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడం వెనుక లంచాల లావాదేవీలే కారణమా.? అనే ప్రశ్నలు స్థానికల నుండి వినిపిస్తున్నాయి.

### టీజీఐఐసీ స్థలాల్లోనూ అదే దందా..

పరిశ్రమల అభివృద్ధి కోసం కేటాయించిన టీజీఐఐసీ భూముల్లోనూ ఇదే రీతిలో అక్రమ తవ్వకాలు జరగడం మరింత ఆందోళన కలిగిస్తోంది. కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని మాఫియా ఖాళీ చేస్తుంటే, పరిశ్రమల శాఖ అధికారులు, సిబ్బంది, రెవెన్యూ శాఖ ఎందుకు స్పందించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### పోలీసుల మౌనం ఎందుకు.?

రాత్రి సమయంలో భారీ లారీలు, జేసీబీలు తిరుగుతున్నా పోలీసుల నిఘా పూర్తిగా లోపించిందా.? లేక ఉద్దేశపూర్వక మౌనమా.? అనే అనుమానాలు బలపడుతున్నాయి. పోలీస్ స్టేషన్ ముందునుండే లారీలు తిరుగుతుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిఘా పూర్తిగా కనుమరుగైందన్న విమర్శలు స్థానికుల నుండి వినిపిస్తున్నాయి. స్థానికులు ఫిర్యాదులు చేసినా చర్యలు లేకపోవడం అధికారుల పాత్రపై మరిన్ని ప్రశ్నలు లేవనెత్తుతోంది.

### ప్రభుత్వ ఆదాయానికి భారీ గండం..

ఈ అక్రమ తవ్వకాల వల్ల ప్రభుత్వానికి కోట్ల రూపాయల ఆదాయం నష్టం జరుగుతుండగా, పర్యావరణానికి కూడా తీరని నష్టం వాటిల్లుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయిన సంబంధిత శాఖల అధికారులు చేతులెత్తేయడం ప్రజల్లో ఆగ్రహాన్ని పెంచుతోంది.

### అధికారులు తక్షణ చర్యలు తీసుకోరా..

మహేశ్వరం మండల పరిధిలోని ప్రభుత్వ స్థలాల్లో జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలపై ఉన్నత స్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మట్టి మాఫియాతో చేతులు కలిపిన అధికారులపై చర్యలు తీసుకొని కేసులు నమోదు చేయకపోతే ఆందోళన చేస్తామని పర్యావరణ పరిరక్షకులు హెచ్చరిస్తున్నారు.

# సైబర్ మోసాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దు

### - హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనం







ఆదిభట్ల (ప్రశ్న న్యూస్) సైబర్ నేరగాళ్లు కేవలం బాధితుల బ్యాంకు ఖాతాలను మాత్రమే ఖాళీ చేయడం లేదని, వారి భవిష్యత్తును, కుటుంబాల ఆనందాన్ని, చివరికి మనశ్శాంతిని కూడా హైజాక్ చేస్తున్నారని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ ఆవేదన వ్యక్తం చేశారు. సైబర్ నేరాల వల్ల కలిగే నష్టం ఎంత తీవ్రంగా ఉంటోందంటే, ఆ బాధ నుండి కోలుకోవడానికి బాధితులకు జీవితకాలం కూడా సరిపోవడం లేదని ఆయన పేర్కొన్నారు. శనివారం నాడు ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని పీఎస్ఆర్ శ్లోక కన్వెన్షన్‌లో 'జాగృత్ హైదరాబాద్ - సురక్షిత్ హైదరాబాద్' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సైబర్ క్రైమ్ అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టాలంటే ప్రజల్లో చైతన్యం రావడం అత్యవసరమని, ముఖ్యంగా విద్యావంతులే లక్ష్యంగా నకిలీ సెబీ సర్టిఫికేట్లు చూపిస్తూ స్టాక్ మార్కెట్, ట్రేడింగ్ పేరుతో జరుగుతున్న మోసాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.నగరంలో రోజుకు సుమారు రూ. 1 కోటి వరకు ప్రజలు ఇలాంటి మోసాల వల్ల నష్టపోతున్నారని గణాంకాలతో సీపీ వివరించారు. బంగారం, వెండి ధరల హెచ్చుతగ్గులను సాకుగా చూపి అపరిచితులు చేసే ట్రేడింగ్ ప్రతిపాదనలను నమ్మవద్దని కోరారు.

సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత చిత్రాలను, సమాచారాన్ని పంచుకునేటప్పుడు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, తెలియని వ్యక్తులు పంపే హానికరమైన ఏపీకే ఫైల్స్ డౌన్‌లోడ్ చేయవద్దని, ఓటీపీలను ఎవరితోనూ పంచుకోవద్దని హెచ్చరించారు. ఇటీవల కాలంలో నకిలీ పోలీసుల పేరుతో 'డిజిటల్ అరెస్ట్' అంటూ వీడియో కాల్స్ చేస్తూ భయభ్రాంతులకు గురిచేసి డబ్బులు వసూలు చేస్తున్నారని గుర్తు చేశారు. తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తామనే అపరిచిత లోన్ యాప్స్ పట్ల కూడా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఆయన హెచ్చరించారు

ఎవరైనా దురదృష్టవశాత్తూ సైబర్ మోసానికి గురైతే ఏమాత్రం ఆలస్యం చేయకుండా 'గోల్డెన్ అవర్'లో 1930 నంబర్‌కు కాల్ చేయాలని, తద్వారా పోగొట్టుకున్న సొమ్మును నేరగాళ్ల ఖాతాల్లో ఫ్రీజ్ చేసి వెనక్కి రప్పించే అవకాశం ఉంటుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ సీపీ (లా అండ్ ఆర్డర్) సౌత్ రేంజ్ తఫ్సీర్ ఇక్బాల్, శంషాబాద్ డీసీపీ బి. రాజేష్, సైబర్ క్రైమ్ డీసీపీ వి. అరవింద్ బాబు, శంషాబాద్ ఏసీపీ శ్రీకాంత్ గౌడ్, ఆదిభట్ల ఏసీపీ ప్రదీప్ కుమార్ రెడ్డి ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మౌలాలి ఆర్ఎఫ్‌సీ ముందు స్ట్రీట్ లైట్ల ముప్పు

- స్తంభాలపై వేలాడుతున్న కరెంట్ లైట్లు,
- ప్రజల ప్రాణాల తో చెలగాటం
- ప్రమాదం జరిగాకే అధికారులు కదులుతారా.?





మల్కాజిగిరి (ప్రశ్న న్యూస్) జిహెచ్ఎంసి అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంమౌలాలి ఆర్ఎఫ్‌సీ ముందు రహదారిపై కరెంట్ స్తంభానికి వేలాడుతూన్న కరెంట్ లైట్లు ప్రజలు భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. రోజూ వందలాది వాహనాలు, పాదచారులు వెళ్లే ఈ ప్రధాన రహదారిపై ఈ స్థాయిలో నిర్లక్ష్యం కొనసాగడం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.కరెంట్ లైట్లు పూర్తిగా భద్రతా నిబంధనలను ఉల్లంఘిస్తూ కిందకు వేలాడుతుండటం గమనార్హం. వర్షం పడిన సందర్భంలో లేదా పొరపాటున లైట్ ఊడిపోయి ప్రజల పై పడితే ప్రాణాలు హరించబడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయిన జిహెచ్ఎంసి అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రత్యేకంగా రాత్రి వేళ ఈ ప్రాంతంలో చీకటి ఎక్కువగా ఉండటంతో ప్రమాదం మరింత పెరుగుతోందని వాహనదారులు చెబుతున్నారు. ద్విచక్ర వాహనదారులు, విద్యార్థులు, వృద్ధులు నిత్యం ఈ మార్గాన్ని ఉపయోగిస్తుండటంతో ఏ చిన్న ప్రమాదం జరిగినా ప్రాణనష్టం తప్పదని హెచ్చరిస్తున్నారు.

### ప్రమాదం జరిగిన తర్వాతే స్పందిస్తారా.?

ప్రమాదం జరిగాక చర్యలు తీసుకుంటారా.? ముందే నివారణ చర్యలు చేపట్టలేరా.?అంటూ జిహెచ్ఎంసి అధికారులపై వాహనదారులు, స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోని మున్సిపల్ స్ట్రీట్ లైట్ విభాగ యంత్రాంగం ప్రజల భద్రతను పూర్తిగా గాలికొదిలేసిందని విమర్శిస్తున్నారు. ఇప్పటికైన మున్సిపల్ అధికారులు స్పందించి తక్షణమే కరెంట్ లైట్లను సరిచేసి, రహదారి భద్రత చర్యలు చేపట్టాలని, లేదంటే జరగబోయే పెద్ద ప్రమాదానికి జిహెచ్ఎంసి అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

# మున్సిపల్ పోరులో రెబల్స్ రగడ

## – కారు, చేయి, కమలాన్ని వణికిస్తున్న సొంత నేతలు




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల క్లైమాక్స్ మొదలైంది. పార్టీలు జారీ చేసిన బీ-ఫారాలు ఒకరికి దక్కితే, ఏళ్ల తరబడి పార్టీ కోసం పనిచేసిన తమను విస్మరించారంటూ పలువురు నేతలు స్వతంత్రులుగా జెండా ఎగురవేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6,700 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నప్పటికీ, ఇంకా 12,900 మందికి పైగా అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఇందులో మెజారిటీ అభ్యర్థులు ప్రధాన పార్టీలకు చెందిన రెబల్స్ కావడం గమనార్హం. గెలుపు గుర్రాల కంటే, ప్రత్యర్థి గెలుపును అడ్డుకునే ఓట్ల చీలిక వ్యూహంతో వీరు ముందుకు వెళ్తుండటం పార్టీల గెలుపు అవకాశాలను దెబ్బతీసేలా ఉంది.

### కాంగ్రెస్‌కు అధికార బలంతో పాటు అసమ్మతి సెగ

అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో రెబల్స్ సమస్య అత్యధికంగా కనిపిస్తోంది. ప్రభుత్వంపై ఉన్న నమ్మకంతో గెలుపు అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని భావించిన ఆశావాహులు టికెట్ ఆశించారు. కానీ ఇటీవల ఇతర పార్టీల నుంచి చేరిన వారికి ప్రాధాన్యత ఇవ్వడంపై పాత క్యాడర్ భగ్గుమంటోంది. ఉదాహరణకు జగిత్యాలలో సీనియర్ నేత జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మధ్య టికెట్ల కేటాయింపు వివాదం రచ్చకెక్కింది. ఇలాంటి పరిస్థితులే మెదక్, గద్వాల వంటి చోట్ల కూడా కనిపిస్తున్నాయి. బీ-ఫారాల పంపిణీలో జరిగిన జాప్యం , సమన్వయ లోపం వల్ల కాంగ్రెస్‌లో రెబల్స్ సంఖ్య పెరిగిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

### బీఆర్ఎస్‌లోనూ అంతర్గత కుమ్ములాటలు

ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీకి ఈ ఎన్నికలు జీవన్మరణ సమస్యగా మారాయి. పార్టీని నమ్ముకుని ఉన్న స్థానిక నేతలు, టికెట్ దక్కని పక్షంలో తమ రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుందని భావించి బరిలోకి దిగారు. ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు వ్యతిరేకంగా సొంత పార్టీ వారే భారీగా నామినేషన్లు వేశారు. కొందరు నేతలు ఇతర పార్టీల నుంచి వచ్చిన విమర్శలకు కౌంటర్ ఇవ్వడం కంటే, సొంత పార్టీ అభ్యర్థులనే టార్గెట్ చేయడం అధిష్టానాన్ని ఆందోళనకు గురి చేస్తోంది. క్రమశిక్షణ చర్యల హెచ్చరికలు జారీ చేసినా చాలా మంది వెనక్కి తగ్గకపోవడం గమనార్హం.

### కమలంలోనూ ముదిరిన అసంతృప్తి

కేంద్రంలో అధికారంలో ఉండటం, రాష్ట్రంలోనూ పుంజుకుంటున్నామన్న ధీమాతో ఉన్న బీజేపీలోనూ రెబల్స్ బెడద తప్పలేదు. మున్సిపల్ ఎన్నికల కోసం పార్టీ పకడ్బందీగా అభ్యర్థులను ఎంపిక చేసినప్పటికీ, కొన్ని చోట్ల ఆర్ఎస్ఎస్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న వారికి కాకుండా కొత్తగా చేరిన వారికి టికెట్లు ఇచ్చారన్న ఆరోపణలు వస్తున్నాయి. దీంతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు రెబల్స్ పై సీరియస్ అయ్యారు. నామినేషన్లు ఉపసంహరించుకోని వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అయినప్పటికీ, నిజామాబాద్, అదిలాబాద్ వంటి ప్రాంతాల్లో బీజేపీ అభ్యర్థులకు రెబల్స్ గట్టి పోటీ ఇస్తున్నారు. ఈ రెబల్స్ ప్రభావం వల్ల బహుముఖ పోటీ నెలకొంది. విజేతను నిర్ణయించే మేజారిటీ ఓట్లు ఈ స్వతంత్రుల ఖాతాలోకి వెళ్లే ప్రమాదం ఉంది.

కేవలం 100 నుండి 500 ఓట్ల తేడాతో గెలుపోటములు నిర్ణయమయ్యే మున్సిపల్ వార్డుల్లో, ఈ రెబల్స్ చీల్చే 50 ఓట్లు కూడా ఫలితాన్ని తారుమారు చేస్తాయి. దీనివల్ల కొన్ని చోట్ల ప్రధాన పార్టీల అభ్యర్థులు ఓడిపోయి, స్వతంత్రులు కింగ్ మేకర్లుగా లేదా విజేతలుగా అవతరించే అవకాశం ఉంది. ఫిబ్రవరి 11న జరిగే పోలింగ్‌లో ఈ రెబల్స్ ఎవరి కొంప ముంచుతారో, ఎవరికి వరం అవుతారో తేలిపోనుంది.

# లాలాపేట రోడ్డు విస్తరణలో అంతులేని నిర్లక్ష్యం: మంత్రి. వినోద్ కుమార్

### - దశాబ్దాలుగా అదే నరకం, అధికారుల నిర్లక్ష్యానికి ప్రజలే బలి
### - జోనల్ కమిషనర్ రవి కిరణ్ పట్టించుకోడు, సమస్య తీర్చాడు







**తార్నాక (ప్రశ్న న్యూస్)** లాలాపేట ప్రధాన రహదారి విస్తరణ అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది. సంవత్సరాలు గడుస్తున్నా రోడ్డు విస్తరణ పనులు పూర్తి కాకపోవడంతో లాలాపేట రహదారి నరకప్రాయంగా మారిందని టిఆర్ఎస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ జాయింట్ సెక్రెటరీ మంత్రి వినోద్ కుమార్ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోజూ వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా సంబంధిత శాఖల అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్డు విస్తరణ పేరుతో కొన్ని గృహాలను మాత్రమే తొలగించి, మిగతావాటిని అలాగే వదిలేయడం వల్ల రహదారి అర్ధాంతరంగా మారింది. పూర్తిస్థాయిలో గృహాలను తొలగించి రోడ్డు విస్తరణ చేయాల్సిన అవసరం ఉన్నప్పటికీ, టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యం వల్ల పనులు అసలు ముందుకు సాగడం లేదని ఆరోపించారు.

### అధికారుల అలసత్వంతో ప్రజలకు శిక్షలా మారిన రోడ్డు..


లాలాపేట రహదారిపై ఎక్కడికక్కడ తడిచిన గుంతలు, ఇరుకైన మలుపులు, ట్రాఫిక్ జామ్‌లు నిత్యకృత్యంగా మారాయి. ప్రతి మంగళవారం వారపు సంతతో అంబులెన్స్‌లు సైతం సకాలంలో వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. స్కూల్ పిల్లలు, వృద్ధులు, మహిళలు ప్రాణాలను పణంగా పెట్టి రహదారి దాటాల్సిన దుస్థితి ఏర్పడింది.

### ఇంత నిర్లక్ష్యమా.? మంత్రి వినోద్ కుమార్

రోడ్డు విస్తరణ విషయంలో సామాజిక కార్యకర్త, టిఆర్ఎస్ గ్రేటరహైదరాబాద్ జాయింట్ సెక్రెటరీ మంత్రి వినోద్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "దశాబ్దాలు గడిచిపోయినా లాలాపేట రోడ్డు విస్తరణ చేయలేని అధికారులు ఏం చేస్తున్నారు.? పూర్తిగా గృహాలను తొలగించి రోడ్డు విస్తరణ చేయకుండా ప్రజలను అనేక ఇబ్బందులకు గురి చేయడం ఎంతవరకు సమంజసం.? ఇది జోనల్ కమిషనర్ రవి కిరణ్, మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యమా లేక కావాలనే చేస్తున్న నిర్బంధమా?" అని ప్రశ్నించారు. టౌన్ ప్లానింగ్ అధికారులు, సంబంధిత శాఖల ఉన్నత అధికారులు బాధ్యత తీసుకొని వెంటనే చర్యలు చేపట్టకపోతే ప్రజా ఉద్యమానికి దిగుతామని హెచ్చరించారు. ప్రభుత్వం స్పందించాల్సిన సమయం ఎప్పుడూ దాటిపోయిందని అందుకోసమే ఇంత నిర్లక్ష్యం అవుతుందన్నారు. లాలాపేట రోడ్డు విస్తరణ సమస్య చిన్నది కాదని, ప్రజల ప్రాణాలకు సంబంధించిన అంశమని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకొని నిర్లక్ష్యం చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకొని, పూర్తిస్థాయిలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని వినోద్ డిమాండ్ చేశారు. లేకపోతే స్థానిక ప్రజల ఆగ్రహం మరింత ఉద్ధృతమయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు.

# భారత్, అమెరికా ట్రేడ్ డీల్‌పై జైరామ్ రమేశ్ వ్యంగ్యం

### – 'హౌడీ మోదీ' కంటే 'నమస్తే ట్రంప్' పైచేయి సాధించిందని ఎద్దేవా



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారత్, అమెరికా ట్రేడ్ డీల్‌పై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జైరామ్ రమేశ్ వ్యంగ్యంగా స్పందించారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. వాణిజ్య ఒప్పందంలో 'హౌడీ మోదీ' కంటే 'నమస్తే ట్రంప్' పైచేయి సాధించిందని పేర్కొన్నారు. వాణిజ్య ఒప్పందంలోని వివరాల ప్రస్తావన సరిగ్గా లేదని అన్నారు. ఈ ఒప్పందం విషయంలో సంయుక్త ప్రకటనలో వివరాలు సరిగ్గా ప్రస్తావించలేదని విమర్శించారు. అయితే భారత్ రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకోదని మాత్రం అర్థమైందని అన్నారు. ఒకవేళ రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తే మన వస్తువులపై 25 శాతం అదనపు సుంకాలు విధిస్తామని అమెరికా ప్రకటించిందని అన్నారు. దేశంలోని రైతుల ప్రయోజనాలను దెబ్బతీసి మరీ అమెరికా రైతులకు సహాయం చేకూరేలా దిగుమతులపై మన ప్రభుత్వం సుంకాలు తగ్గించనుందని విమర్శించారు. అమెరికా దిగుమతులు మూడు రెట్లు ఎక్కువగా ఉండటంతో మన వాణిజ్యం తుడిచిపెట్టుకుపోతుందని అన్నారు. మనకు చెందిన ఐటీ, ఇతర సేవల ఎగుమతులపై ఇంకా అనిశ్చితి కొనసాగుతోందని అన్నారు. ఈ క్రమంలో మన ఎగుమతుల్లోని కొన్ని వస్తువులు గతంలో కంటే ఎక్కువ సుంకాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై భారత్, అమెరికా సంయుక్త ప్రకటన చేశాయి.

# హైడ్రా 'ఫోన్ ఇన్'

### - కమిషనర్‌కు ఫోన్ చేసి సమస్యలు చెప్పిన ప్రజలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైదరాబాద్ నగర ప్రజలు ఫోన్ చేసి సమస్యలను చెప్పుకున్నారు. హైడ్రా కార్యాలయంలో ఆయన తొలిసారి 'ఫోన్ ఇన్' కార్యక్రమం చేపట్టగా, గంటలోనే 36 మంది ఫోన్ చేశారు. భూ ఆక్రమణలు, నీటి వనరులు కలుషితం కావడం వంటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ స్థలాలు, నీటి వనరుల పరిరక్షణ కోసం హైడ్రా పరిధిని ఔటర్ రింగ్ రోడ్డు బయటకు కూడా విస్తరించాలని ప్రజలు కోరారు. తమ ప్రాంతాల్లోని చెరువులో మురుగు నీరు వచ్చి చేరుతోందని, దుర్గంధభరిత వాతావరణంతో ఇబ్బందులు పడుతున్నామని కొంతమంది కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. గుర్రపు డెక్కపెరిగి దోమలతో ఇబ్బందిపడుతున్నట్లు చెప్పారు. ఇతర చెరువుల్లాగే తమ ప్రాంతంలోని చెరువులనుకూడా అభివృద్ధి చేయాలని కోరారు. ప్రతి సోమవారం హైడ్రా ప్రజావాణి ఉంటుంది. కానీ ప్రజలతో నేరుగా మాట్లాడేందుకు కమిషనర్ 'ఫోన్ ఇన్' కార్యక్రమం చేపట్టారు. హైడ్రా కార్యాలయం వరకు రాలేనివారు సమస్యలను ఫోనులో చెప్పుకునే అవకాశం కల్పించారు. శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంట వరకు 'ఫోన్ ఇన్' కార్యక్రమం జరగగా, స్వయంగా కమిషనర్ రంగనాథ్ ఫిర్యాదుదారులతో మాట్లాడారు. ప్రజల సమస్యలను విని పరిష్కారానికి సంబంధిత అధికారి వివరాలను వారికి అందజేశారు. వారం రోజుల తర్వాత కూడా సమస్య పరిష్కారం కాకుంటే నేరుగా తనకు ఫోను చేయాలని ఫిర్యాదుదారులకు సూచించారు. సెలవు రోజుల్లో మినహా ప్రతి శనివారం 040-29565750, 040-29565759 ఈ నంబర్లకు ఫోను చేసి సమస్యలను తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాల నుంచి పలువురు ఫోన్లు చేసి తమ వద్ద కూడా చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయని, వాటిని కాపాడాలని కోరారు. అయితే హైడ్రా పరిధి ఓఆర్ఆర్ వరకేనని రంగనాథ్ స్పష్టం చేశారు. మొదటి విడతలో 6 చెరువులను అభివృద్ధి చేశామని, త్వరలో మరో 14 చెరువులను అభివృద్ధి చేస్తామని అన్నారు.

# ఫోరెన్సిక్ ల్యాబ్ లో అగ్నిప్రమాదంపై కేటీఆర్ అనుమానాలు

### - ఓటుకు నోటు కేసు కోసమేనా? అంటూ సంచలన ఆరోపణలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నాంపల్లిలో ఉన్న ఫోరెన్సిక్ ల్యాబ్ లో అగ్నిప్రమాదం చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అనుమానాలు వ్యక్తం చేశారు. ఎక్స్ వేదికగా ఆయన స్పందిస్తూ ఓటుకు నోటు కేసుకు సంబంధించిన వాయిస్ రికార్డింగులను, ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆధారాలు లేకపోవడాన్ని కప్పిపుచ్చేందుకు చేసిన ప్రయత్నంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. ఇదే అంశంపై బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ స్పందిస్తూ ల్యాబ్ మొత్తం కాలిపోతోందని, ఏయే ఆధారాలు నాశనం చేశావు అంటూ రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ప్రశ్నించారు. ప్రమాదం వివరాల్లోకి వెళితే ల్యాబ్ లోని తొలి అంతస్తులో ఉన్న కంప్యూటర్ ల్యాబ్ లో తొలుత మంటలు చెలరేగాయి. నిమిషాల వ్యవధిలోనే భవనంలోని ఇతర ప్రాంతాలకు మంటలు వ్యాపించాయి. అగ్నిప్రమాదం కారణంగా ల్యాబ్ లోని కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోయాయి. కార్యాలయ సిబ్బంది ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఐదు ఫైరింజన్లతో అక్కడకు చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం చోటుచేసుకుందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. కీలకమైన కేసులు, ఫోరెన్సిక్ ఆధారాలకు సంబంధించిన డాక్యుమెంట్లు దెబ్బతిన్నాయా? అనే కోణంలో అధికారులు ఆరా తీస్తున్నారు.

# భారత వ్యాక్సిన్లు రాకపోవడం మా ఆర్థిక వ్యవస్థకు భారంగా మారింది

### - పాకిస్థాన్ మంత్రి ఆవేదన



ఇస్లామాబాద్ (ప్రశ్న న్యూస్) పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్ నుంచి అందుబాటు ధరల్లో లభించే వ్యాక్సిన్ల సరఫరా నిలిచిపోవడం పాకిస్థాన్‌కు ఆర్థికంగా భారంగా మారిందని ఆ దేశ ఆరోగ్య మంత్రి ముస్తఫా కమల్ వెల్లడించారు. భారత వ్యాక్సిన్లు గత ఏడాది నుంచి రావడం లేదని అన్నారు. వీటి దిగుమతి కోసం వందల మిలియన్ డాలర్లు ఖర్చవుతోందని, ఇది దేశ ఆర్థిక వ్యవస్థకు పెను భారంగా మారిందన్నారు. ప్రస్తుతం ప్రతి సంవత్సరం 400 మిలియన్ డాలర్లతో వ్యాక్సిన్లను దిగుమతి చేసుకుంటున్నామని, వీటిలో 49 శాతం ఖర్చులను 'గావీ' (గ్లోబల్ అలయన్స్ ఫర్ వ్యాక్సిన్ అండ్ ఇమ్యునైజేషన్) ద్వారా పని చేసే అంతర్జాతీయ సంస్థలు, మిగతా 51 శాతం ప్రభుత్వం భరిస్తోందని వెల్లడించారు. స్థానికంగా వ్యాక్సిన్ ఉత్పత్తి ప్రారంభించకపోతే 2031 నాటికి దిగుమతి కోసం రూ.10 వేల కోట్ల వరకు ఖర్చు పెట్టాల్సి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. అప్పటికి వ్యాక్సిన్ల సరఫరాకు అంతర్జాతీయ సహకారం ముగిసిపోతుందని అన్నారు. అత్యంత పేద దేశాల్లోని పిల్లలకు వ్యాక్సిన్ అందించడానికి 'గావీ' పనిచేస్తుంది. 'గావీ' సాయంతో పాకిస్థాన్ అత్యంత చౌకగా టీకాలను సేకరించేది. వీటిలో ఎక్కువగా భారత్ నుంచే వస్తాయని, అవి అందుబాటు ధరల్లో ఉంటాయని పాకిస్థాన్ మంత్రి వెల్లడించారు. కరోనా సమయంలో లక్షలాది కొవిడ్ వ్యాక్సిన్లను భారత్ నుంచి సేకరించడానికి 'గావీ' సహాయం చేసిందని అన్నారు. పాకిస్థాన్ ప్రభుత్వం ప్రస్తుతం పౌరులకు 13 రకాల వ్యాక్సిన్లను ఉచితంగా అందిస్తోంది. అయితే ఏ వ్యాక్సిన్‌ను కూడా స్థానికంగా ఉత్పత్తి చేయడం లేదు. 24 కోట్ల జనాభాతో ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన ఐదో దేశంగా పాకిస్థాన్ ఉంది. ప్రతి సంవత్సరం 62 లక్షల జననాలు నమోదవుతుండటంతో వ్యాక్సిన్లకు డిమాండ్ పెరిగింది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588